తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ



కుప్పం సబ్ రిజిస్టర్ కార్యాలయం

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

కుప్పంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అవినీతి నిరోధక శాఖ అధికారులు విచారణ చేపట్టారు.గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ పనిచేసిన వెంకటసుబ్బయ్య ఏసీబీ అధికారుల దాడిలో పట్టుబడ్డారు .ఈ కేసుకు సంబంధించి విచారణ నిమిత్తం ఏసీబీ అధికారులు గురువారం కుప్పం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. పలువురు సాక్షులను విచారించి వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ నిమిత్తం కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంకు వచ్చినట్లు పేర్కొన్నారు. తదుపరి విచారణ తిరుపతిలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

## శ్రీసాయినాథునికి వజ్రకిరీటం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని సాయినగర్‌లో వెలసి ఉన్న షిరిడీ సాయినాథునికి భక్తుల సహకారంతో ఒక కోటి 75 లక్షల వ్యయంతో సిద్ధం చేసిన వజ్రాలు పొదిగిన బంగారు కిరీటాన్ని గురువారం అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా కిరీటధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం దేవస్థానం ప్రధాన కార్యదర్శి మొగళ్లూరు బాలసుబ్రహ్మణ్యం, అర్చకులు శివకుమార్ తదితరుల ఆధ్వర్యంలో గోపూజ, హోమాలు నిర్వహించి పూర్ణాహుతి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అయితా మల్లీశ్వరరావు, ఉపాధ్యక్షులు మాలకొండయ్య, కోశాధికారి అయితా ఉదయశంకర్, సభ్యులు కందగడ్డల నాగేశ్వరరావు, బద్రినారాయణ, వీరభద్రరావు, ఉమమ్మ, రంగయ్య, మీరయ్య, ఇందూరు శ్రీధర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధతపై విజయోత్సవ సంబరాలు

## తిరుపతిలో వేడుకలు



తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలపడంతో నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వేడుకలు నిర్వహించారు. అమరావతికి మద్ధతు పలుకుతూ కార్యాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు, మహిళలు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించడం దేశంలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వరల్డ్ క్లాస్ రాజధానికి అమరావతి రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో అదనపు కమిషనర్ శారదా దేవి, రెవిన్యూ అధికారి సేతుమాదవ్, మెప్మా సిబ్బంది

## కుప్పం కడ కార్యాలయంలో



కుప్పం ,ఏప్రిల్ 2 ప్రభాతవార్త

రాష్ట్ర రాజధానిగా అమరావతి నగరాన్ని చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడం పట్ల గురువారం రాత్రి కుప్పం ఏరియా అభివృద్ధి అథారిటీ కార్యాలయంలో అధికారులు విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పెద్ద ఎత్తున సిబ్బంది బాణసంచా కాల్చారు .కడ కార్యాలయ ఆవరణ అంతా రంగవల్లులతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతి నగరం స్థిరంగా ఉంటుందని రాష్ట్రానికి రాజధాని కొత్త దిశను చూపిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చిట్టిబాబు, శివయ్య, డిప్యూటీ తహసిల్దార్ హరికృష్ణ, మండల పరిషత్ ఏవో బాలకృష్ణ ,కడ కార్యాలయ అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మావతి వర్సిటీలో సంబరాలు

యూనివర్సిటీ(తిరుపతి),ఏప్రిల్ 2ప్రభాతవార్త:



అమరావతి బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిన సందర్భంగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా ఇంజినీరింగ్ కళాశాల ధృతి హాల్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధాని లేకుండా ప్రజల ఆశలతో మాత్రమే మిగిలిపోయిన కఠిన పరిస్థితులను గుర్తుచేశారు. బిల్లు ఆమోదించడంతో హాల్ అంతా హర్షధ్వానాలు, చప్పట్లతో మార్మోగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ బిల్లు ఆమోదం పొందడం ప్రజల ఆశయాలను సాకారం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగని, ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేదిగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్. ఉష ,ఐక్యుఏసి డైరెక్టర్ ప్రొఫెసర్ టి. త్రిపుర సుందరి , సెంట్రల్ నెట్‌వర్కింగ్ ఫెసిలిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఎన్. నీలిమ, పాఠశాలల డీన్లు ప్రొఫెసర్ సి. వాణి, ప్రొఫెసర్ సుధ,విశ్వవిద్యాలయ పిఆర్ఓ డాక్టర్ శ్రీ రజిని పాల్గొన్నారు.

# తిరుపతిలో 30 పోలీస్ యాక్టు

### -నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
### -జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో తిరుపతి నగరంలో ప్రశాంతతను కాపాడటంలో, శాంతిభద్రతల పరిరక్షణలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. సామాజిక మాధ్యమాలు, పోలీసువర్గాలకు అందిన సమాచారంతో రేపు శనివారం ఉదయం 9 గంటలకు తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద టిటిడి చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్‌తో వైసిపి నాయకులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక పూజలు ,నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారని తెలియవచ్చింది.అలాగే దీనికి ప్రతిగా టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకుని ప్రత్యేక పూజలను నిర్వహించేందుకు ప్రణాళికలు చేస్తున్నారని పోలీసుశాఖకు విశ్వసనీయంగా తెలియవచ్చింది. దీనివల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా శాంతికి భంగం వాటిల్లకుండా తిరుపతి జిల్లాలోని అన్ని పోలీసు సబ్‌డివిజన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఇప్పటికే అమలులో ఉందని, ముందస్తు పోలీసు అనుమతి లేకుండా ఎటువంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం , నలుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా గుమికూడడం పూర్తిగా నిషేధించబడినది. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమించినట్లైతే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడుతుందన్నారు. ప్రజలు పోలీసు వారికి సహకరించవలెనని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవితం!

## శుకబ్రహ్మాశ్రమం వార్షికోత్సవాల్లో సాధువులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త

నేడు సమాజంలో ఆధ్యాత్మిక చింతన కొరవడింది. దైవమార్గాన్ని విస్మరించి తమ సొంత మార్గాలతో అశాంతి,అసౌఖ్యం, దుఖంతో నిత్యం సతమతమౌతూ జీవనం గడుపుతున్నామని ఈ వాతావరణం మారాల్సిన అవసరం ఏంతైనా ఉందని గురువారం శుకబ్రహ్మాశ్రమంలో జరుగుతున్న వార్షికోత్సవాల్లో పలువురు సాధువులు అన్నారు.ఆధ్యాత్మిక సభలకు పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి పర్యవేక్షించారు. ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి అధ్యక్షతన జరుగుతున్న సనాతన సభలకు రాష్ట్ర నలుమూలల నుంచి పీఠాధిపతులు, సాధువులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు దిశ దెశ నిర్దేశం చేస్తూ కర్మఫలనుసారం .జన్మలు లభిస్తాయని వివరించారు. రాగద్వేషాలకు కతీతంగా ఆధ్యాత్మిక చింతనతో సనాతన ధర్మాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. నాడు ఒక్కొక్క ఆశ్రమ వాసి వందల సంవత్సరాలు జీవిస్తున్నారంటే అందులో రహస్యం వారు ఎల్లవేళల్లో భగవన్నామస్మరణతో గడిపే వారని భవబంధాలకు అతీతంగా వ్యవహారించే వారని కాబట్టి వారి ఆయువు వందల సంవత్సరాలు ఉండేదని గుర్తించాలన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి,

### సనాతన ధర్మానికి ప్రధాన్యత:

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జీవనది సువర్ణముఖి నదీ తీరాన సుమారు 75 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన శుకబ్రహ్మాశ్రమం నిత్యం సనాతన ధర్మాన్ని ప్రచారానికి ప్రాధన్యత ఇచ్చారని ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి వివరించారు. నాడే ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందస్వామి స్త్రీ విద్యకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు.ఆశ్రమంలోని వేద పాఠశాలలో మహిళలకు సంస్కృత విద్యను అందించుటకు కృషి చేసారన్నారు. స్వామినిర్వహించిన సమావేశాలు పండిత పామరులను ఆకట్టుకుందన్నారు.గీతా యజ్ఞం పేరుతో ఏర్పాటు చేసి మారుమూల గ్రామాల్లో నిరుపేదలకు కంటి చూపు అందించారన్నారు. ఇలా ఆశ్రమం నిత్యం ధార్మిక కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు.నేటి సమాజంలో చోటు చేసుకుంటున్న రుగ్మతలను రూపుమాపటానికి ఆధ్యాత్మికతను ప్రజలకుఅవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అందుకే రాబోవు రోజుల్లో ప్రణాళిక రూపొందించుకొని విద్యాప్రకాశానందగిరి స్వామి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళటానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఆశ్రమం గుర్తించిందన్నారు.

# గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహనంపై గురువారం కల్యాణ వెంకన్న ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామి వారు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై గరుడవాహనంపై అధిష్టించి భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, కళ్యాణ సుందర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నాకు న్యాయం జరిగే వరకూ

## ఎమ్మెల్యే శ్రీధర్‌ను కట్టడి చేయండి

### ప్రజాదర్బార్‌లో శ్రీధర్ బాధితురాలు



రైల్వే కోడూరు రూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానందరెడ్డి ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌లో గురువారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు హర్షవీణ ప్రజా దర్బార్ నందు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానందరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరుకు పెద్దదిక్కైనా రూపానంద రెడ్డి సారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ రాష్ట్ర నాయకులు నాకు న్యాయం జరిగే వరకూ అరవ శ్రీధర్‌ను కండువా వేసుకుని పార్టీ కార్యక్రమాలలో పాల్గొనకూడదని ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా తాను పవన్ కళ్యాణ్‌ను ఆశ్రయించి ఆయన ద్వారా తనకు మేలు జరుగుతుందని ఉద్దేశంతో పనిచేసుకుంటుండగా, అరవ శ్రీధర్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలను తుంగలో తొక్కి మాయమాటలతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతవరకు సమంజసమని ఆమె విలేకరుల వద్ద వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్‌లు తప్పక న్యాయం చేస్తారని ఉద్దేశంతో ప్రజాధర్బాల్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

**హర్ష వీణపై జనసేన నాయకులు దాడి: స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు.**

రైల్వే కోడూరు పట్టణంలోని స్థానిక టోల్గేట్ వద్ద అమరావతి రాజధానిపై సంబరాలు చేస్తున్న తరుణంలో అటుగా వెళుతున్న అరవ శ్రీధర్ బాధితురాలను కొంతమంది జనసేన అగ్ర నాయకులు విశక్షణారహితంగా కొట్టారని హర్ష వీణ స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల వద్ద పేర్కొన్నారు. తనకు ప్రాణహాని ఉందని అయితే తన ఫిర్యాదును స్వీకరిస్తారు లేదో కూడా అనుమానంగా ఉందని ఆమె అన్నారు. తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తానని ఆమె అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

### అగ్నికి ఆహుతైన బ్రేక్స్ ఇండియా బస్సు

బాలాయపల్లి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



వెంకటగిరి - నాయుడుపేట రోడ్డులోని బాలాయపల్లి మండలం మెల్బూరు సమీపం లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన పెదికూరు ప్రదీప్ రెడ్డి (40) కన్ను మూశాడు. మేనకూరు సెజ్, నాయుడుపేట నుండి వెంకటగిరి వైపు వెళ్తున్న బ్రేక్స్ ఇండియా బస్సు ఈ ప్రమా దంలో అగ్నికి ఆహుతైంది. బస్సు ఉన్న కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగ లేదు. మెల్బూరు గ్రామంలోని మద్యం దుకాణం సమీపం నుండి మృతుడు అకస్మాత్తుగా ప్రధాన రోడ్డు పైకి రావడంతో, క్రాస్ రోడ్ వద్ద బస్సు ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో మేనకూరు సెజ్ బ్రేక్స్ ఇండియా బస్సు అగ్నికి ఆహుతైంది. అత్తివరం గ్రామానికి చెందిన పెదికూరు ప్రదీప్ రెడ్డి ఘటన స్థలంలోనే మరణించాడు. ప్రమాద సమయంలో బైక్ ఫ్యూయల్ ట్యాంక్ పేలడంతో అగ్ని ప్రమాదం సంభవించి, బ్రేక్స్ ఇండియా బస్సు పూర్తిగా దగ్ధమైంది. అయితే, బస్సులో ఉన్న డ్రైవర్తో పాటు మొత్తం 38 మంది కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు. సంఘటన స్తలాన్ని సిఐ ఏవి రమణ పరిశీలించారు. మంటలను వెంకటగిరి ఫైర్ ఇంజిన్ బస్సు మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఏవి రమణ తెలిపారు.

## కిడ్నాప్ కేసులో మరో నలుగురు అరెస్ట్

తిరుచానూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

విద్యార్థి నేతల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యం సిబ్బందిపై తిరుచానూరు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే 13 మందిని అరెస్టు చేయగా విచారణలో మరో 4 గురిని బుధవారం అరెస్ట్ చేశారు. మధు, కిరణ్ కుమార్ రెడ్డి, హరికృష్ణ, కిషోర్ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ తెలిపారు.

# ఎస్వీయూలో పరిపాలనా విధానాలపై గందరగోళం..

## ఉద్యోగులు, విద్యార్థుల్లో అయోమయం



తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త

ఎస్వీయూ (శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం)లో ఇటీవలి కాలంలో పరిపాలనా విధానాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి యూనివర్సిటీలో తీసుకుంటున్న నిర్ణయాలు స్పష్టత లేకుండా ఉన్నాయని, దీంతో ఉద్యోగులు, విద్యార్థుల్లో అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. వర్సిటీలో ఉన్నత స్థాయిలో ఉన్న ఓ అధికారి తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిందని సిబ్బంది వాపోతున్నారు. బోధనేతర సిబ్బందిపై వరుస బదిలీలు అమలు చేస్తూ, సుమారు 500 మందికి పైగా సిబ్బందిని పలు దఫాల్లో విభాగాల మధ్య మార్చినట్లు సమాచారం. ఈ బదిలీలు అవసరానికి మించినవిగా, కొన్నిచోట్ల అర్హతలకు సరిపోని విధంగా జరిగినట్లు ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.ఇటీవల మరోసారి సుమారు 20 మంది బోధనేతర సిబ్బందిని పలు విభాగాలకు బదిలీ చేయడం కూడా సిబ్బందిలో ఆందోళనకు దారితీసింది. ఈ తరహా నిర్ణయాలు కార్యనిర్వహణలో అంతరాయాలను కలిగిస్తున్నాయని వారు అంటున్నారు.అదే సమయంలో, బదిలీలు మరియు పదోన్నతుల విషయంలో పారదర్శకత లోపిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది అనుకూలులకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ తగిన స్పందన లభించడం లేదని ఉద్యోగులు అంటున్నారు.ఈ పరిస్థితుల మధ్య వర్సిటీ పరిపాలనపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి సమస్యలు వెళ్లినప్పటికీ, పరిస్థితుల్లో మార్పు కనిపించకపోవడం సిబ్బందిలో మరింత అసంతృప్తికి దారితీస్తోంది.ఇలాంటి పరిస్థితులు కొనసాగితే విశ్వవిద్యాలయం పనితీరు మరియు ప్రతిష్టపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పరిపాలనా విభాగం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కుప్పకూలిన పందిరి.. తప్పిన ప్రమాదం



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల సౌకర్యార్థం ఎండలను తట్టుకొనుటకు ఏర్పాటు చేసిన పందిళ్లు గురువారం మధ్యాహ్నం ఓ హోరు గాలికి కుప్ప కూలింది. అయితే ఆ సమయంలో అక్కడ భక్తులు ఉన్నారు కానీ ఎవ్వరికి ఏమి ప్రమాదం జరగలేదు. రెండవ గోపురం వద్ద భక్తుల సౌకర్యార్థం దేవస్తానం ఓ అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ కోసం పందిళ్ల ఏర్పాటును సృష్టించారు.బుధవారం పందిళ్లను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.గురువారం ఆ పందిరి ఒక్కసారిగా కుపపకూలింది.దీనిని బట్టి అధికార పార్టీ ముసుగులో పని చేసి కాంట్రాక్టర్ పనిలో నాణ్యత ఎంతో అర్థమౌతుంది. గతంలో దేవస్థానం,ప్రభుత్వ కార్యాలయాల్లో సదుపాయాల కోసం పనులు చేసేవారు. కానీ నేడు పరిస్థితి భిన్నంగా మారింది. కాంట్రాక్టర్ల కోసం పనులు అన్నట్లు మారిందనే విమర్శలు చోటు చేసుకున్నాయి. గురువారం కుప్పకూలిన పందిళ్లకు ఇనుప స్థంబాలతో ఏర్పాటు చేసారు.అయితే ఎలా కూలిందనేది ప్రశ్నార్థకంగా మారింది.

**శాశ్వత పనులు ఎందుకు చేయరు?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిధుల కొరత లేదు. అయితే శివరాత్రికి కోట్లు వెచ్చించి చేస్తున్న ఏర్పాట్లును ఎందుకు శాశ్వత పనులు చేపట్టడం లేదన్నది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.గోపురాల ముందు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు వేసవి కాలం తప్పని సరి, కాబట్టి ఇక్కడ శాశ్వతం షెడ్లు ఏర్పాటు చేయవచ్చు.కానీ అలా చేస్తే కాంట్రాక్టర్లు పరిస్థితి ఏమిటి? అనేది చర్చనీయాంశంగా మారింది. నేడుకాంట్రాక్టర్లకోసం పనులు సాగుతున్నాయనే విమర్శలు బాహాటంగా ఉన్నాయి. ఈ గోపురం పక్కనే కౌంటర్ల షెడ్డులు నిర్మించారు. రెండవ గోపురం నుంచి వెళ్ళే సమయంలో ఇక్కడ కూడా కలిపి నిర్మించవచ్చు కదా? అని చర్చించుకుంటున్నారు.

## నేటితో ముగిసిన సర్పంచ్‌ల పదవి కాలం

**పూతలపట్టు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలో ఐదేళ్ల పాలన కాలం నేటితో అధికారికంగా ముగిసింది. 2021లో ఎన్నికైన సర్పంచులు వార్డు సభ్యుల పదవి కాలం ఏప్రిల్ 2 అర్ధరాత్రితో పూర్తికావడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నిర్వహణ కోసం కీలక నిర్ణయం తీసుకుంది, కొత్తగా ఎన్నికలు జరిగి కొత్త సర్పంచులు వార్డు సభ్యులు కొలువుదీరే వరకు గ్రామంలో పాలన కుట్టు పడకుండా ప్రత్యేక అధికారుల నియమానికి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం ఈ నెల 3వ తేది ఉదయం నుంచి గ్రామ పంచాయతీలకు తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓ, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు స్వీకరించారు సర్పంచుల రికార్డులను, చెక్ పవర్ బాధ్యతలను ప్రభుత్వ ఆదేశాలతో ఇప్ప టికే సంబంధిత అధికారులకు అప్పగించారు. జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని గ్రామాలకు అధికారు లను కేటాయిస్తూ ఇప్పటికే నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నిధులు విత్ డ్రా,పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి అత్యవసర విధులను ప్రత్యేక అధికారులే పర్యవేక్షిస్తారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

## జర్నలిస్టు మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంపు విజయవంతం

**– అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెచ్ బాలరాజ్**

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



జర్నలిస్టు ఆరోగ్యపరిరక్షణకు ప్రత్యేకంగా నిర్వహించిన మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంపుకు విశేష స్పందన లభించిందని అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెచ్ బాలరాజ్ తెలిపారు. జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ ఆద్వర్యంలో జిల్లా పరిసాలన, ఐఅండ్ పిఆర్ విభాగం సమన్వయంతో అపోలో సంస్థ సహకారంలో గురువారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి జిల్లా వ్యాప్తంగా మీడియా ప్రతినిధులు కుటుంబసభ్యులతో కలసి పెద్దసంఖ్యలో హాజరై సమగ్ర వైద్యపరీక్షలు చేయించుకొని ఆరోగ్యపరిస్థితిపై అవగాహన పొందారన్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఈ వైద్యశిబిరంలో జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, అర్థోపెడిక్స్, చర్యవ్యాధులు, చెవి, ముక్కు, గొంతు, కంటి వైద్యవిభాల నిపుణులు సేవలందించారు. మహిళల కోసం గైనకాలజీ పరీక్షల్లో, పిల్లల కోసం పీడియాట్రిక్ సేవలు ప్రత్యేకంగా నిర్వహించారు. అలాగే కంప్లీట్ బ్లడ్ కౌంట్, మూత్రపరీక్షలు, రక్తంలో చక్కెర స్థాయిలు, కిడ్నీ, లివర్ పంక్షన్ టెస్లులు, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఎక్స్ రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసిజీ, ఎకో పరీక్షలు కూడా చేసారు. మహిళల కోసం మామోగ్రామ్ పాప్‌స్మిర్ పరీక్షలను అందుబాటులో వుంచారు. పరీక్షల ఆధారంగా స్పెషలిస్టులు వ్యక్తిగత ఆరోగ్య సూచనలు, అవసరమైన చికిత్సలను సూచించారు. ముఖ్యంగా వైద్యసేవలు అంతరాయం లేకుండా జరిగేలా ఎఐఎంఎస్ఆర్, జిహెచ్‌హెచ్ అధికారులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలలో అపోలో నాలెడ్జ్ సిటీ యూనిట్ హెచ్ బాలరాజ్, మెడికల్ సూపరింటెండెంట్ డా.రంగనాథ్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామగోపాల్‌రెడ్డి, ఐఅండ్ పిఆర్ డిడి వేలాయుధం, వివిధ విభాగాల అధిపతులు, వైద్యనిపుణులు పాల్గొన్నారు.

## అమరావతి చట్టబద్ధతపై టిడిపి శ్రేణుల సంబరాలు

**గంగాధర నెల్లూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



అమరావతిని తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునేలా ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధత కల్పించి నందుకు గురువారం మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరు బస్టాండు కూడలి వద్ద బాణాసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని ఏదంటే చెప్పలేకపోయామని జగన్ ప్రభుత్వం మూడు ముక్కలాటతో సరిపెట్టిందని మన ముఖ్యమంత్రియంద్రబాబు నాయుడు రాజధాని లేని రాష్ట్రంగా భూమిని అందించిన రైతుల వేదన ఫలించేలా రాజధాని మహిళలు పడిన కష్టానికి ఫలితంగా నేడు అమరావతిని రాష్ట్ర కేంద్రప్రభుత్వాలు ఆమోద ముద్రవేసి చట్ట భద్రత కల్పించడం చరిత్రలో సువర్ణధ్యాయంగా నిలిచిపోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మెన్ కృష్ణమ నాయుడు నాయకులు హరీష్ యాదవ్ దేవరాజులు పురుషోత్తం నాయుడు కోదండ రెడ్డి చల్లగుండ్ల దీపక్ చౌదరి ప్రసాద్ చౌదరి వినోద్ చౌదరి జాన్ ప్రకాష్ కృష్ణయ్య గోపి రజేష్ చిరంజీవిలతో పాటు పలువురు నాయకులు కార్యక్తలు పాల్గొన్నారు.

## సర్పంచ్ అధ్వర్యంలో ఘన సన్మానం

**వి.కోట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**



తమ పదవీ కాలం ముగియడంతో వి.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ పి ఎన్ లక్ష్మమ్మ వార్డు సభ్యులను,పంచాయతీ కార్మికులను సన్మానించినారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ప్రజలు తమపై నమ్మకం తో ఐదు సంవత్సరాలు తమకు సర్పంచుగా సేవలందించేందుకు అవకాశం ఇచ్చినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఎప్పుడూ లేని విధంగా వీ.కోటను అభివృద్ధి పథంలో నడిపించి పంచాయతీ కు గణనీయంగా రెవెన్యూ ను పెంచిన ఘనత తమకే దక్కుతుందని వారు తెలిపారు.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,వైకాపా స్టేట్ సెక్రటరీ నాగరాజు సహకారంతో వి.కోటను ప్రగతి పదంలో నడిపించగలిగామని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పంచాయతీ కు అన్నివేళలా అందుబాటులో ఉంటూ వి.కోటను పారిశుద్ధంగా ఉంచిన పరిశుద్ధత కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు తోడ్పడిన వార్డు మెంబర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఈవో నరేష్, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పి. ఎన్ నాగరాజు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రోహి సంస్థ వార్షికోత్సవం

**చిన్నగొట్టిగల్లు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**




చిన్న గొట్టిగల్లు మండలం స్థానిక పంచాయతీ మసీద్ వీధిలోని రోహి సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షులు సహదేవయ్య ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సహదేవయ్య మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల వార్షికోత్సవాలు, ఆయా సంస్థలు సాధించిన ప్రగతిని సమీక్షి ంచుకోవడానికి, దాతలను, వాలంటీర్లను అభినందించడానికి మరియు భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకోవడానికి ఒక వేదిక. ఈ వేడుకలు సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ, సేవలను విస్తరించడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని మరియు పారదర్శకతను పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది జ్యోతి, షేక్ మక్బూల్ సాహెబ్, ముని రాజా, ధనమ్మ, లలితమ్మ, శ్రీదేవి, కృష్ణవేణి, మోనిక, మీనాక్షి , రెడ్డప్ప, చలపతి, వాణి, రత్నమ్మ, శరణ్య, తదితరులు పాల్గొన్నారు.

## కలప ట్రాక్టర్ బోల్తా



**శాంతిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

మండలంలోని ఏడవ మైలు క్రాస్ లో కుప్పం కేజీఎఫ్ ప్రధాన రహదారిలో కలప లోడ్తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా పడింది.అయితే ఈ ప్రమాదంలో ఎవరు గాయ పడలేదు .

## అమరావతి రాజధానిగా చట్టసభల్లో బిల్లు ఆమోదంతో సంబరాలు




**రామకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

కేంద్ర రాజధానిలో లోకసభ, రాజ్యసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం రాజధాని శాశ్వత అమరావతిగా బిల్లు ఆమోదంపై రామకుప్పం మండలంలో పాఠశాలల్లో, ప్రజా ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. గురువారం మిజాలాపురం హైస్కూల్, రాజుపేట లోని గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్లో కేక్ కత్తిరించి, అమరావతి అలంకారంలో వినూత్నంగా ప్రదర్శించారు. సాయంత్రం మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఇళ్ళ ముంగిట దీపాలు వెలిగించి రాజధాని అమరావతికి దీప హారతులు ఇద్దాం అనే నినాదం చేశారు. అనంతరం టపాకాయలు పేల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ,కార్యకర్తలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం సందర్శించిన దేవాదాయ శాఖ అధికారి

**రామకుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ ఇన్స్ పెక్టర్ శశి కుమార్ సందర్శించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గత నెల 26వ తేదీన ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు, ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని పునర్ నిర్మించి అన్ని వసతులు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్సీ శ్రీకాంత్ దేవాలయ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సందర్శించి ఆలయ పునర్నిర్మాణ పనులకు గాను గ్రామస్తుల వివరణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాగర్ రెడ్డి, బాలరాజు ,సుబ్రి, కనకరాజు, నరసింహులు, పద్మమ్మ, వేద పండితులు, నాగరాజు శర్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ

**బైరెడ్డిపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



బైరెడ్డి పల్లి మండలం ఆలపల్లి పంచాయితీ లో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొన్న రైతు సోదరులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఆర్డీవో భవాని , మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బి ఎమ్ కిషోర్ అందజేసారు. కార్యక్రమం లో తహసీల్దార్ ప్రసన్న కుమా ర్ ,సింగల్ విండో చైర్మన్ నాగరాజు , ఆర్ ఐ దామోదర్ ,ఎక్స్ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, పార్టీ అధ్యక్షులు జయరాం రెడ్డి, రైతు విభాగం నాయకులు సుబ్రమణ్యం రెడ్డి , కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహల నిరోధంపై అవగాహన సదస్సు

**బైరెడ్డిపల్లి ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



స్థానిక మహిళా సమాఖ్య భవనంలో బాల్య వివాహల నిరోధంపై సదస్సును నిర్వహించారు .ఈ సదస్సుకు జిల్లా కోర్టు అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. బాల్యవివాహాలతో కలిగే నష్టాలు, లైంగిక వేధింపులు ,పోక్సో చట్టం తదితరాల గురించి వివరించారు. అలాగే బాలికల కోసం ఏర్పాటుచేసిన 1098 హెల్ప్ లైన్ నెంబర్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలిక సంరక్షణ అధికారి షణ్ముగం, డాక్టర్ విజయ్ చందర్ ,డాక్టర్ పద్మావతి పిహెచ్ సి కేంద్రాల సిబ్బంది, అంగన్ వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు, డి హెచ్‌ఏవోలు సావిత్రి కాంతమ్మ పాల్గొన్నారు.

## కూటమి నాయకుల సంబరాలు

**శాంతిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త.**



స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద దేశం నేతలు, కూటమి నేతల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు ఏపీ రాజధాని అమరావతి అంటూ నినాదాలు చేశారు పెద్ద ఎత్తున డ్రమ్స్ తో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి కె ఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు ,మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు ,మండల పార్టీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, నాయకులు జనార్ధన్ రెడ్డి, ఎల్ జయరామిరెడ్డి ,చంద్ర ,గిరి, హరి ,చంద్ర, సింగిరి శ్రీనివాసులు ,ఉయ్యాల జయరాం రెడ్డి ,చంద్రకళ, శ్యామలమ్మ ,శివశంకర్, మురుగన్ ,శివ ,మురళి, రుద్రప్ప ,గజేంద్రతోపాటు పలువురు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,**

## ప్రజల మనోభావాలు దెబ్బతీస్తే మూల్యం తప్పదు

**ఏపీఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్**



**కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రజల మనోభావాలను వైయస్సార్సీ నేతలు దెబ్బతీస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతి నగరాన్ని పేర్కొంటూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి రైతుల కల నెరవేరిన రోజు అని ఆయన అభివర్ణించారు. ఇలాంటి సమయంలో కూడా వైఎస్ఆర్సిపి అధినేత జగన్ రాజధాని పేరు మార్చాలని మాట్లాడడం భావ్యం కాదన్నారు .అలా మార్చాల్సి వస్తే వైఎస్ఆర్సిపి పేరు మార్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల కలల రాజధాని అమరావతి అని ఆయన పేర్కొన్నారు .రాజధానిపై వైకాపా నేతలు విషం చిమ్మడం మానుకోవాలని పేర్కొన్నారు. లేకుంటే 2029 ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి కనుమరుగు కావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీరాళ్ల గంగమాంబ కళ్యాణోత్సవం

**కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రాళ్ల గంగమాంబ అమ్మవారి వార్షిక జాతర బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడవ రోజు అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అర్చకులు సోమశేఖర్ శాస్త్రి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ చేసి సంప్రదాయ రీతిలో కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీలోకి చేరిక

**కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త.**



మండలంలోని రాగిమానుమిట్ట గ్రామానికి చెందిన పలువురు మైనార్టీలు గురువారం టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి శివకుమార్, పార్టీ అధ్యక్షుడు రిజ్వాన్ ,షాదీ మహల్ డైరెక్టర్ అబ్దుల్ గఫార్, బూత్ ఇన్చార్జ్ అక్మల్, రవి పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

**ఏఎంసీ చైర్మన్ జీఎం రాజు**

**కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



కుపంలోని చంద్రన్న వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు మండిల య ం జ వ వా న ం ల ం గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏఎంసీ చైర్మన్ జీఎం రాజు ఆదేశించారు. గురువారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ఆయన వివిధ ట్రేడర్ల యజమానులు, మండి యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా టమోటా పంట సీజన్ మొదలైందని ఈ నేపథ్యంలో రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి వారికి ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు .మార్కెట్ యార్డులో కనీస వసతులు కల్పించాలన్నారు. రైతులకు ఏదైనా సమస్య తలెత్తితే తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని ఆయన కోరారు .కార్యక్రమంలో పలువురు ట్రే డర్ల యజమానులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉచిత కోచింగ్ స్టడీ మెటీరియల్

**కుప్పం ఏప్రిల్ 2 ప్రభాతవార్త**



పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులకు కుప్పంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రామ కృష్ణారావు తెలిపారు. ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులను స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9912342101,832830622 నెంబర్లను సంప్రదిం చాలని కోరారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**శాంతిపురం ఏప్రిల్ 2 ప్రభాతవార్త.**



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుప్పం పిఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యం లో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 70 మంది కంటి సమస్యలతో బాధపడేవారు ఈ శిబిరంకు హాజరుకాగా వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి 11 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు .కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ నారా యణ, పీహెచ్ సి వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ ,డాక్టర్ ప్రసాద్‌తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ శిఖావత్‌ను కలిసిన డా. పి. సి. రాయులు..

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాతవార్త

కేంద్ర రాజభాషా మంత్రిత్వ శాఖ హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమితులైన డా. పి. సి. రాయులు,గురువారం న్యూఢిల్లీలోని అధికారిక నివాసంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ శిఖావత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా,కమిటీ సభ్యత్వం కోసం తనను మూడేళ్ల కాలానికి నామినేట్ చేసినందుకు డా. రాయులు మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ సూచకంగా శాలువా కప్పి,తిరుమల శ్రీ బాలాజీ ప్రసాదాన్ని అందజేశారు.రాష్ట్ర సాంస్కృతిక,ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని డా. రాయులు కోరారు. హిందీ సలహా కమిటీ సభ్యుడిగా మంత్రిత్వ శాఖ కార్యక్రమాల్లో హిందీ ప్రాచుర్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

## వారపుసంత వేలం ద్వారా 51 వేల ఆదాయం

**శాంతిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

మండలంలోని తుమ్మిసి పంచాయతీ రోడ్డులో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంతకు సంబంధించి గురువారం అధికారులు వేలంపాటలు నిర్వహించారు. అంగళ్ల వేలం కు సంబంధించి 51 వేల రూపాయల ఆదాయం లభించింది. అబకలదొడ్డి సచివాలయం వద్ద ఉన్న దుకాణాల వేలం పాటలు వాయిదా పడ్డాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నారాయణ, రాధిక పాల్గొన్నారు .

## పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర

- అధికారి త్రివిక్రమరావు

సత్యవేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర అని సత్యవేడు మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు అన్నారు. ప్రస్తుతం పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం గురువారంతో పూర్తయిన నేపథ్యంలో సత్యవేడు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్ పర్యవేక్షనలో వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిపాలన అధికారి త్రివిక్రమరావు పంచాయతీ పాలకవర్గాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పంచాయతీ పాలనలో సర్పంచ్‌లే సుప్రీమన్నారు. ఈ ఐదేళ్ళలో పంచాయతీ పాలన సజావుగా సాగడానికి సహకరించిన వార్డు సభ్యులు, అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయ భవనంలో పరిపాలనాధికారి కలసి గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు జాబితాకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు సత్యవేడు పంచాయతీ అధికారులు గ్రామ సర్పంచ్ మంజుల రమేష్‌కి శాలువ కప్పి గజమాలతో సత్కరించారు. అలాగే సర్పంచ్ మంజుల రమేష్ గ్రామ ఉప సర్పంచ్ రతిరాణితో సహా వార్డు సభ్యులను పిలిచి శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. దీంతో పాటు పరిపాలన అధికారి త్రివిక్రమరావు, పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్‌ని, పంచాయతీ సిబ్బంది పలువురిని గ్రామ సర్పంచ్ పూలమాలతో శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు మణికంత, వీరమ్మ, కోనయ్య, శోభ, మహేష్, రేఖ, హేమభూషణం, హరీష్, మునివేలు, వైదేహి,ధనలక్ష్మి,జగన్నాథం,జూనియర్‌అసిస్టెంట్‌వెంకటేష్, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సత్యవేడు వెలుగు ఏపీఎం, సీసీలకు ఉత్తమ పురస్కారం

సత్యవేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



స్త్రీనిధి రుణాలు మంజూరు, చెల్లింపులో జిల్లాలోని సత్యవేడు మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడంలోను చెల్లింపుకు సంబంధించి ఉత్తమ ప్రతిభకనబరచినందుకు తిరుపతి జిల్లా సత్యవేడు పేదరిక నిర్మూలన సంస్థ(వెలుగు) ఏపీఎం డాంగేయాదవ్, సీసీ శివకుమార్‌లకు ఉత్తమ పురస్కారం ప్రదానం చేశారు. గురువారం తిరుపతి డీఆర్‌డీఏ కార్యాలయంలో బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంతో స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలను ఏపీఎం డాంగేయాదవ్,సీసీ శివకుమార్‌లు అందుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్త్రీనిధి రుణాలు మంజూరు, రికవరీకి సంబంధించి వందకు వంద శ్శాతం లక్ష్యం సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు గాను ఉత్తమ పురస్కారాలకు వీరు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో డీఆర్‌డీఏ పీడీ హరిప్రసాద్ వీరికి ఉత్తమ పురస్కారాలు అందజేశారు.

## కళావేధిక నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ

విజయపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



మండలంలోని ఆదర్శ పాఠశాలగా గుర్తింపు పొందిన శ్రీహరిపురం ప్రాథమిక పాఠశాలలో విజయపురం మండల పరిషత్ అధ్యక్షుడు డి.లక్ష్మిపతి రాజు తన సొంత నిధులతో నిర్మించనున్న కళావేదిక(స్టేజ్)కు గురువారం భూమిపూజ చేశారు. ఇటీవల ఆయన పాఠశాలను సందర్శించి నప్పుడు పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు స్కూలు ఫంక్షన్ నిర్వహణ కోసం, పాఠశాల ఇతర కార్యక్రమాల కోసం, మహిళా సంఘాల మీటింగ్ జరుపుకోవడం అన్నిటికి అనుకూలంగా ఒక స్టేజీ కావాలని కోరారు. ఆ మేరకు లక్ష్మిపతి రాజు సతీమణి స్వర్గీయ దొమ్మరాజు గీత జ్ఞాపకార్థం తన సొంత నిధులతో ప్రస్తుతం స్టేజ్ నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జయరామరాజు, స్కూలు కమిటీ చైర్మన్ సురేష్‌రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు, నరేష్, చిన్నబ్బరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భజగోవిందం గ్రంధావిష్కరణ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమంలో జరుగుతున్న వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా విద్యాప్రకాశానందగిరిస్వామి వ్యాఖ్యతగా రూపొందించిన 'జగద్గురు శంకరాచార్య విరచితమైన భజగోవిందము' అనే గ్రందాన్ని ఆవిష్కరించారు.33 పద్యాలతో కూడుకున్న గ్రంధంలో అర్థం, వివరణలతో చక్కటి గ్రంధాన్ని విడుదల చేసారు.ఈ గ్రంధాన్ని సభలకు హాజరైన భక్తులకు ఉచితంగా అందించారు.అ గ్రంధంలో మానవుడు ఆచరించాల్సిన దర్మాలను అనుసరించకూడని విదానాలను పొందుపరచారు.వశిష్ట ఆశ్రమ పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి, సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థ స్వామి, చిన్మయమిషన్ నుంచి శివప్రకాశానందగిరి స్వామి, శంకరానందగిరి ఆశ్రమ పీఠాధిపతి గురుచరణ నందగిరి స్వామి,పుత్తూరు ఆశ్రమపీఠాధిపతి శివానందగిరి స్వామి విచ్చేసారు.వారు భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేసారు.

## మున్సిపల్ ఆదాయ వనరుల పరిరక్షణకే ప్రాధాన్యం

కమిషనర్‌భవాని ప్రసాద్



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త శ్రీకాళహస్తి ఆదాయ వనరులను పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ భవాని ప్రసాద్ వివరిం చారు.గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తమ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పన్ను వసూళ్ళలో బాధ్యతా యుతంగా వ్యవహ రించి సుమారు రూ.9కోట్లు వసూలు చేసారని అభినందించారు. అయితే పట్టణంలో ఎంతో కాలంగా కొందరుపన్నులు చెల్లించక మున్సిపాలిటికి బకాయి ఉన్నారన్నారు.అలాంటి మొండి బకాయిలను వసూలు చేయటంలో సిబ్బంది చాలా కష్టపడ్డారన్నారు. ఎంతో కాలంగా నీటి పన్నులు చెల్లించక నీటిని వాడుకుంటూ పబ్బం గడిపారని ఈ ఏడాది నీటి సరఫర అపేస్తామనటంతో దీర్ఘకాలిక పనులు వసూలయ్యాయన్నారు.

**షాపు రూముల వేలం:** శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన షాపింగ్ కాంప్లేక్సులను ఎంతో కాలంగా లీజులు చెల్లించక జాప్యం చేస్తున్నారని కాబట్టి నిబంధనల ప్రకారం వాటిని వేలం వేయటానికి నోటిఫికేషన్ జారి చేసినట్లు వివరించారు. ఈనేపధనయంలో పియంఆర్ షాపింగ్ కాంప్లేక్సు (వైయస్‌ఆర్ సర్కిల్ కూడలిలోని) షాపు నెంబర్ 3,34,35,38 అల ఆ గే పియంఆర్ షాపింగ్ కాంప్లేక్సు సినిమావీధిలోని షాపు నెంబర్ 5,7,1011,12,15,42,45,47 కొత్తపేటలోని షాపు(బస్టాండు రోడ్డు) షాపు నెంబర్ 19,20 గదులను ఈ నెల 8న ఉదయం 11 గంటలకు వేలం పాటలు నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించారు. మున్సిపల్ ఆదాయాలను క్రమబద్దీకరించుటకు అన్ని చర్యలు తీసుకకుంటున్నామని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.కాగా కూరగాలయ మిని మార్కెట్ ను ఈ నెల 1 నుంచి వచ్చే మార్చి 31 వరకు గుత్తలు వసూలు చేసుకొనుటకు హెచ్చుపాటదారుడు ఎన్ గోపాల్ శెట్టికి అప్పగించినట్లు కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.నిబందనలు ఉల్లఘించిన ఎడల లీజు రద్దు చేయబడుతుందని కమిషనర్ వివరించారు.

## లా విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలి..

పరీక్షలు వాయిదా వేయాలని ఎన్ఎల్ఎస్ఏ వినతి

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త



రాయలసీమ లా కాలేజీ, కె.ఎం.ఆర్ లా కాలేజీలలో చదువుతున్న 240 మంది లా విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎన్ఎల్ఎస్ఏ) ప్రతినిధులు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య అప్పారావును కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎన్ఎల్ఎస్ఏ జాతీయ అధ్యక్షుడు సుందర రాజు మాట్లాడుతూ, 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసి, రెండు కాలేజీలకు చెందిన 240 మంది విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని కోరారు. విద్యార్థులు ఇప్పటికే ఫీజులు చెల్లించి, తరగతులకు హాజరై, ఇంటర్నల్ పరీక్షలు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అనుమతులు లేవనే కారణంతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం సరికాదన్నారు. ఇది విద్యార్థుల తప్పు కాదని, ఒక సంవత్సరం వృథా కావడం వల్ల వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో ఇలాంటి కేసుల్లో కోర్టులు విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు అనుమతి ఇవ్వాలని తీర్పులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరీక్షలను వాయిదా వేసి అవకాశం కల్పించాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ యోగేశ్వర్, జిల్లా కోఆర్డినేటర్ డానియల్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత రాజధానిగా అమరావతి.. పాఠశాలల్లో సంబరాలు

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించిన సందర్భంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.విద్యార్థులు అమరావతి రాజధాని ప్రాముఖ్యతపై ప్రసంగాలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, అమరావతి రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు సమాజం, రాష్ట్ర అభివృద్ధిపై అవగాహన పెంపొందించుకొని భవిష్యత్తులో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పాలిసెట్‌పై ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త

శ్రీ గగన కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్2026 పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కరుణామూర్తి తెలిపారు. ఈ సదస్సు శుక్రవారం (0304 2026) ఉదయం 10:00 గంటలకు నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సులు, కళాశాలల ఎంపిక, పరీక్ష విధానం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అలాగే, ఆదివారం ఉదయం 10:00 గంటలకు పాలిసెట్ నమూనా పరీక్ష (మాక్ టెస్ట్) కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మరిన్ని వివరాలకు 9014052757, 9553590077 నంబర్లను సంప్రదించవచ్చు.

## అమరావతి బిల్లు ఆమోదం.. ఎస్వీయూలో సంబరాలు

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త



అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ)లో సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఉన్నత విద్యాసంస్థల మాదిరిగానే ఎస్వీయూలో కూడా ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సెనెట్ హాల్‌లో ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అమరావతి ప్రాముఖ్యత, రాజధాని స్థానంగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలపై వీడియో ప్రదర్శించారు.ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ, రాష్ట్రానికి శాశ్వత రాజధాని ఏర్పడటంతో అభద్రతా భావం తొలగిపోయిందని తెలిపారు. అమరావతి భవిష్యత్తులో పారిశ్రామిక, సాంకేతిక, డిజిటల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.రెక్టర్ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ, రాజధాని రాష్ట్రానికి గుండెవంటిదని, అమరావతి ఆమోదం ఆనందించదగ్గ విషయం అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ, అమరావతిని ప్రజా రాజధానిగా ప్రకటించడం చారిత్రక నిర్ణయమని, భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమం అనంతరం అధికారులు, సిబ్బంది పరిపాలన భవనం ముందు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు, ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్టాంప్, రిజిస్ట్రేషన్ కీలక భాగస్వామ్యం

- న్యాయవాది జక్కుల శ్రీరామమూర్తి



సత్యవేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

దేశంలో ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు, ఒప్పందాల ప్రక్రియలో స్టాంప్ రిజిస్ట్రేషన్ కీలకభాగం, స్టాంప్‌వెండర్ దగ్గర కొనుగోలు చేసే ప్రతి స్టాంప్ పేపర్‌ప్రభుత్వ నియంత్రణలో ఉండడం వల్ల పారదర్శకత, నమ్మకం ఏర్పడుతుందని న్యాయవాది జక్కుల శ్రీరామమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థలో నియంత్రణ లేకపోవడం అనేక సమస్యలకు దారి తీస్తోంది. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో డాక్యుమెంట్ రైటర్లు ఎలాంటి అధికారిక గుర్తింపు లేకుండా పని చేస్తున్నారు. వీరిలో కొందరికి సరైన చట్టపరమైన అవగాహన లేకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ సమయంలో పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. ఈ పొరపాట్లు తరువాత పెద్ద వివాదాలకు, కోర్టు కేసులకు కారణమవుతున్నాయి. చివరికి నష్టపోయేది సాధారణ ప్రజలేనని, అందుకే స్టాంప్ వెండర్ల మాదిరిగానే డాక్యుమెంట్ రైటర్లను కూడా తప్పని సరిగా రిజిస్టర్ చేయాలన్నారు. ప్రభుత్వం వారి అర్హతలను పరీక్షించి, శిక్షణ ఇచ్చి అధికారిక గుర్తింపు ఇవ్వాలని, ఇలా చేస్తే డాక్యుమెంట్‌లలో తప్పులు తగ్గుతాయని, మోసాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని, రిజిస్ట్రేషన్ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుందన్నారు. లేకపోతే రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ రైటర్లకు ఒక ప్రత్యేక ఐడీ, లైసెన్స్ ఇవ్వడం ద్వారా బాధ్యతను కూడా నిర్ధారించవచ్చు. ఏదైనా తప్పిదం జరిగితే వారిపై చర్యలు తీసుకోవడం సులభమవుతుందన్నారు. సాంకేతిక అభివృద్ధి చెందిన ఈ కాలంలో డాక్యుమెంట్ వ్యవస్థను కూడా ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆంధ్రుల ఆకాంక్షను ఎన్డీఏ నెరవేర్చింది: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త



రాష్ట్ర శాశ్వత రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఆమోదం లభించడం ఆనందదాయకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చుతూ రాజ్యసభలో అమరావతి చట్ట సవరణ బిల్లుకు ఆమోదం లభించిందన్నారు.ఈ సందర్భంగా కృష్ణాపురం వద్ద ఎన్డీఏ నాయకులతో కలిసి పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో అమరావతికి చట్టబద్ధత లభించిందని తెలిపారు. అమరావతి రైతులు, మహిళల పోరాటానికి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కీలకంగా నిలిచారని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతి సింగపూర్ తరహాలో అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని చెప్పారు.గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, మూడు రాజధానుల విధానం వల్ల రాష్ట్రం వెనక్కు వెళ్లిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జీ, గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నరసింహ యాదవ్, సామంచి శ్రీనివాస్, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌లు జేబి శ్రీనివాస్, దంపూరి భాస్కర్, బిజి కృష్ణ యాదవ్ , బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్ , కోడూరు బాలసుబ్రమణ్యం, పాటకం వెంకటేష్, కందాటి సురేష్ రెడ్డి, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు వరప్రసాద్, తోట వాసు, ఎస్ కే బాబు, పొన్నాల చంద్ర, దూది కుమారి, దూది శివ, క్రికెట్ విజయ్, చింతంశెట్టి మధు, కీర్తన, అన్నా అనిత,శిరీషా, కొండా రాజామోహన్, ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోట్ల వ్యయం వృథా..

అసంపూర్తిగా గోల్డెన్ జూబ్లీ సెమినార్ హాల్స్

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త




ఎస్వీయూలో రాజీవ్ గాంధీ మెమోరియల్ గోల్డెన్ జూబ్లీ కాంప్లెక్స్ ఆఫ్ సెమినార్ హాల్స్ నిర్మాణం సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండిపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన ఈ ప్రాజెక్ట్ ఇప్పటికీ పూర్తి కాకపోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ నిర్మాణానికి పునాది రాయి వేసినప్పటికీ, వివిధ కారణాలతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. నిర్మాణం పూర్తయితే నాలుగు ఆధునిక ఆడిటోరియాలు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేవని, కానీ నిరక్ష్యం కారణంగా అది సాధ్యపడలేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు.పెరిగిన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ పెంపు అవసరమని కాంట్రాక్టర్లు సూచించినప్పటికీ, అధికారులు తగిన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ప్రాజెక్ట్ నిలిచిపోయిందని విమర్శించారు. దీంతో భారీగా ఖర్చు చేసిన భవనం ఉపయోగం లేకుండా నిలిచిపోయి, గతంలో పాత సామగ్రి నిల్వ చేసే గోదాముగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో గురువారం వీసీ టాటా నర్సింగరావును కలిసి వెంటనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దినేష్, ఉదయ్, ప్రసాద్, పండు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో రిజిస్ట్రార్ వ్యవహారం హాట్ టాపిక్



తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త

ఎస్వీయూలో రిజిస్ట్రార్ భూపతినాయుడు వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. విద్యార్థి నేతలను కులం పేరుతో దూషించారనే ఆరోపణలతో ఆయనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన విద్యార్థి వర్గాల్లో ఆగ్రహాన్ని రగిలించింది.ఈ నేపథ్యంలో ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు గురువారం వీసీ టాటా నర్సింగరావును కలిసి రిజిస్ట్రార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని వినతిపత్రం సమర్పించారు. విద్యాసంస్థలో ఇలాంటి ప్రవర్తన అసహ్యకరమని, ఇది విద్యార్థుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని వారు తెలిపారు.ఘటన జరిగి ఐదు రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తక్షణం రిజిస్ట్రార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం ఎస్వీయూలో హాట్ టాపిక్‌గా మారి, విద్యార్థులు, సిబ్బంది మధ్య విస్తృతంగా చర్చకు దారితీస్తోంది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శివ శంకర్ నాయక్, ప్రేమ్ కుమార్, శివ బాలాజీ, యుగంధర్, మునుస్వామి, సుకుమార్, చంద్ర నాయక్, రాజా, పవన్, మల్లీ, విష్ణు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త

ఏపీ పాలిసెట్2026 ప్రవేశ పరీక్ష దరఖాస్తులను ఈనెల 9వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పై ద్వారకనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీతో ముగిసిన గడువును విద్యార్థుల అభ్యర్థన మేరకు 9వ తేదీ వరకు అధికారులు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## మహిళా ఉద్యోగులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాత వార్త

వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఎస్వీయూ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వర్సిటీలోని సెనేట్ హాల్లో మహిళా బోధన, బోధనేతర సిబ్బందికి, విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె నాగరాజ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న బోధన, బోధనేతర మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి తగిన జాగ్రత్తలు పాటించాలని,

## విద్యార్థులకు పట్ల తల్లిదండ్రులకు జాగ్రత్తలు తీసుకోవాలి



వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ సూచించారు. వేసవి సెలవుల సమయంలో విద్యార్థులు అప్రమత్తంగా లేనందు వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. సమ్మర్ సీజన్‌లో పిల్లలు ఈత కోసం చెరువులు, బావులు, నదులు, కాలువలు, గుంతలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలపై నిత్యం గమనిస్తూ, వారు ఎక్కడికి వెళ్తున్నారు. ఎవరితో కలుస్తున్నారు అనే విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీనేజ్ వయసులో పిల్లలు చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, వ్యసనాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి పరిస్థితులను నివారించేందుకు తల్లిదండ్రులు వారికి మంచి మార్గదర్శనం చేయాలని తెలిపారు. సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు క్రీడలు, పుస్తక పఠనం, నైపుణ్యాల అభివృద్ధి, ఉన్నత విద్య ప్రణాళికపై దృష్టి పెట్టాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహిస్తూ, వారి భవిష్యత్తు లక్ష్యాల వైపు దారి చూపించాలని సూచించారు.

# సూళ్లూరుపేట డివిజన్

## అమరావతి విజయం ఆంధ్రప్రదేశ్ గర్వం : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: లోక్‌సభలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధం చేసే బిల్లుకు ఆమోదం లభించడం ప్రతి ఆంధ్రుడి గర్వకారణం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు.ఇది కేవలం ఒక బిల్లు ఆమోదం మాత్రమే కాదు. ఇది ప్రజల ఆశలు, రైతుల త్యాగాలకు లభించిన గౌరవం అని చెప్పారు. అమరావతి కోసం భూములు ఇచ్చి పోరాడిన రైతుల అచంచల విశ్వాసం ఈ రోజు ఫలించింది. వారి త్యాగం వల్లే ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధ్యమైంది అన్నారు. ఈ గొప్ప నిర్ణయానికి మార్గదర్శకత్వం వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. అమరావతిని రాజధానిగా నిలబెట్టేందుకు అంకితభావంతో కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక అభినందన తెలిపారు.

## నాణ్యమైన విద్య, ఆహారం అందిస్తున్నాం



బాలాయపల్లి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: బీసీ హాస్టల్స్ లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికార ఆహారాన్ని అందిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంగమాంబపురం ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాన్ని అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ తిరుపతి జిల్లా భరత్‌కుమార్‌రెడ్డి, డివిజనల్ అధికారిణి జోత్స్నలు ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వంటగది, స్టాక్ రూమ్, టాయిలెట్స్, గార్డెన్‌లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్స్ విద్యార్థులకు నాణ్యామైన విద్య, ఆహారం అందిస్తున్నట్లు భరత్ కుమార్ రెడ్డి తెలిపారు. చిన్నారులకు నాణ్యామైన పౌష్టికాహారం అందించాలని ఈ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులుకు సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించాలని వార్డెన్ పి.శ్రీనివాసులుకు భరత్ కుమార్‌రెడ్డి సూచించారు. వచ్చే విద్య సంవత్సరానికి హాస్టల్ లో విద్యార్థుల సంఖ్య పెంచాలని వార్డెన్‌కు సూచించారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులు తెలిసిన విద్యార్థులను హాస్టల్స్ లో చేర్పించాన్నారు. ఈ తనిఖిలో భాగ్యరాజ్, సిబ్బంది ఉన్నారు.

## టిడిపి శ్రేణులు క్యాండిల్స్‌తో సంబరాలు



వాకాడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: మండలం కొండాపురం గ్రామంలోని మాజీ ఎంపీటీసీ విజయమ్మ, టిడిపి సీనియర్ నాయకుడు మోహన్ నాయుడు, టిడిపి నాయకులు అట్లా కస్తూరయ్య, మేరీగా సుబ్రహ్మణ్యం, వంకా రమణయ్య, వంకా దశయ్య, వాకాటి కోటయ్య, కళ్యాణ్ కార్యకర్తలు మోహన్ నాయుడు నివాసంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పూలమాలు వేసి క్యాండిల్స్‌తో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మోహన్ నాయుడు కొండాపురం గ్రామంలోని థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేయడంతో ప్రతి వీధిలోను టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకుంటూ వెళ్లారు.

## ఊరూర అమరావతి సంబరాలు



పెళ్లకూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: అమరావతికి రాష్ట్ర శాశ్వత రాజధానిగా చట్టపరమైన గుర్తింపు ఇచ్చినందుకు మండలంలోని పలు గ్రామాలలో దీపాలు వెలిగించి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. మండలంలోని ముమ్మారెడ్డి గుంట పంచాయతీకి చెందిన తెదేపా పార్టీకి చెందిన నాయకులు మేరుం చంద్ర ఆధ్వర్యంలో తేదేపా జెండాలను చేబూని బైక్ ర్యాలీ చేపట్టారు.

## ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతి



తడ,ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి పార్లమెంటు సాక్షి గా ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ఏకగ్రీవంగా ఆమోదంపై తిరుపతి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కామిరెడ్డి మురళిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది నవ్యాంధ్రప్రదేశ్ సాధించిన చారిత్రాత్మక విజయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యువత ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వైపు చూసే విధంగా నిర్మిస్తున్నారన్నారు.

## ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు దరఖాస్తులకు ఆహ్వానం

తడ,ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మండల అక్కంపేట మోడల్ స్కూల్ నందు ఇంటర్మీడియట్ అడ్మిషన్లుకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నుండి ఐఐటి,జెఈఈ, నీట్, సిఏ ఫౌండేషన్ కోర్సులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే మోడల్ స్కూల్ నందు ప్రత్యేక శిక్షణలు తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. దరఖాస్తులు ఆన్లైన్లో గాని, నేరుగా గాని తేదీ 30 లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అమరావతికి దీప హారతులు



తడ,ఏప్రిల్ 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రజలు గర్వించే విధంగా పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టానికి సవరణ చేసే బిల్లుకు పార్లమెంటులో ఆమోదం లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో దీపాలు వెలిగించి అమరావతికి దీప హారతులు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. తడ ఎంపీడీవో కార్యాలయం నందు అమరావతికి దీప హారతులు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్ నాయక్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు కృషితోనే అమరావతి విజయం :ఎస్సీవీ



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: లోక్‌సభలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధం చేసే బిల్లుకు ఆమోదం లభించడం ప్రతి ఆంధ్రుడి గర్వకారణం అని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆయన స్వగృహంలో జ్యోతి వెలిగించిన కార్యక్రమంలో అన్నారు. ఇది ప్రజల ఆశలు, రైతుల త్యాగాలకు లభించిన గౌరవం అని చెప్పారు. అమరావతి కోసం భూములు ఇచ్చి పోరాడిన రైతుల పోరాటం, ముఖ్యమంత్రి పట్టుదలతో ఇది జరిగిందన్నారు. అమరావతి రాజధాని బిల్లును చట్టసభల్లో ప్రవేశ పెట్టి ఆమోదంపజేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అమరావతిని రాజధానిగా నిలబెట్టేందుకు అంకితభావంతో కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కి ప్రత్యేక అభినందన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, స్కిట్ కళాశాల మాజీ చైర్మన్ గురుదశరథన్, రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, జి.వి.రమణమూర్తి (స్వామి), మాజీ కౌన్సిలర్ అంజలి సుధాకర్, సత్రవాడ ప్రవీణకుమార్, గోగినేని భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీటీసి సుబ్రహ్మణ్యం, గౌడ సంఘం నాయుడు సిద్దులయ్య తదితరులు పాల్గొన్నారు.

## సృజనాత్మకత,నైపుణ్యాల పెంపే మోంటెస్సోరి లక్ష్యం




తిరుపతి విద్య, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: విశ్వాస్ మోంటెస్సోరి స్కూల్ సెకండ్ యాన్యువల్ డే వేడుకలు ప్రజ్ఞ విశ్వాస్ ఉత్సవ్ 2026 థీమ్‌తో గురువారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఉత్సాహ భరితంగా జరిగింది.ఈ కార్యక్రమానికి తిరుపతి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శారదా దేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ,చిన్నారుల ప్రాథమిక విద్య వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని తెలిపారు. మోంటెస్సోరి విధానం పిల్లల్లో సృజనాత్మకత,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకమని,ఇలాంటి వార్షికోత్సవాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసి సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు.బెంగళూరుకు చెందిన విశ్వాస్ మోంటెస్సోరి ట్రైనర్ దీప రవిచంద్రన్ మాట్లాడుతూ,మోంటెస్సోరి పద్ధతి ద్వారా పిల్లలు స్వయంగా నేర్చుకునే అలవాటు పెంపొందుతుందని పేర్కొన్నారు. స్కూల్ ఫౌండర్ అండ్ ప్రిన్సిపాల్ వినీల అధ్యక్షత వహిస్తూ, ప్లే క్లాస్ నుంచి యూకేజీ వరకు నాణ్యమైన విద్యను అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. చిన్నారులు నృత్యాలు, నాటికలు, గీతాలతో ప్రేక్షకులను ఆకట్టుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు.ఈ విజయాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనమని అతిథులు అభినందించారు. కార్యక్రమం చివరలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 486వ నేత్రదానం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు గురువారం 486వ నేత్రదానం అందింది. విక్రమ్ సారాభాయ్ నగర్‌కు చెందిన బెల్లంకొండ రఘుపతిస్వామి (86) మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## అమరావతి బిల్లుకు మద్దతుగా మోటార్‌బైక్ ర్యాలీ



సూళ్లూరుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: పార్లమెంటులో రాజధాని అమరావతి బిల్లు ఆమోదం పొందడాన్ని హర్షిస్తూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ మాట్లాడుతూ ఆంధ్రా ప్రజల చిరకాల స్వప్నమైన అమరావతి రాజధానికి పార్లమెంటులో చట్టబద్ధత రావడం పట్ల ప్రతి ఆంధ్రుడు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా మోటార్‌బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, దంతాల రవి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు చిక్కిలు క్వాలిటీ ఉన్నవి ఇవ్వాలి




నాయుడుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: నాయుడుపేట వెదనపర్తి సుందర రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో 3 మండలాల సెక్టర్ లీడర్ల సమావేశం ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర నాయకులు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి అంగన్వాడీలకు మేలు చేస్తాదని ఎంతో ఆశగా ఉన్నారని, అటువంటి వారిని ఈ ప్రభుత్వం ఆశ నిరాశ చేసిందని గత ఎన్నో సంవత్సరముల నుండి అంగన్వాడీలు పిల్లలకు పౌష్టిక ఆహారం అందించ అంగన్వాడీలకు కనీస వేతనం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం గ్రాడిటీ పిఎఫ్ విఎస్‌ఐ ఉద్యోగ భద్రత వేసవి సెలవులు కల్పించకుండా కొత్త జీవోలు నెంబర్ 5 తెచ్చి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి వి శ్యామలమ్మ, కళావతి కళ్యాణి, విజయమ్మ, బుజ్జమ్మ, విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిప్రోలు సర్పంచ్‌కు ఘన సన్మానం



నాయుడుపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: మండలం గొట్టిప్రోలు గ్రామ పంచాయతీ సర్పంచ్ పరసా వెంకటరమణయ్యను మాజీ మంత్రి డాక్టర్ పరసా రత్నం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పదవి కాలం ముగియడంతో గురువారం గొట్టిప్రోలు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పరసా వెంకట రమణయ్య ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పరసా వెంకటరత్నం, గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపాలయ్య,పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు సర్పంచిగా పదవీ విరమణ చేసిన పరసా వెంకట రమణయ్యకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

## దంత సంరక్షణ పట్ల శ్రద్ధ చూపాలి



వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ దంత సంరక్షణపై శ్రద్ధ చూపాలని శశిస్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో తొమ్మిదవ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సిబ్బందికి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ దంత సంరక్షణ పట్టే అందరి ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. దంతాలను శుభ్రం చేయడం నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యం కూడా సక్రంగా ఉండదని తెలిపారు. బెటాలియన్ సిబ్బందికి దంతాల సంరక్షణపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. డాక్టర్ లక్కలనేని సాయి తేజ మాట్లాడుతూ షుగరు, బిపి వంటివి అదుపులో ఉంచుకోవాలని సూచించారు. షుగర్,బీపీ అదుపులో లేకపోతే వచ్చే ప్రమాదాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనిషా, డాక్టర్ అభినయ, డాక్టర్ రామ్ ప్రదీప్, బెటాలియన్ కమాండెంట్ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు ఇచ్చిన హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ అందిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. తమకు ఉచిత విద్యుత్ ఇచ్చినందుకు కృతజ్ఞతగా రూరల్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు చేనేత కార్మికులు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య నేతృత్వంలో గురువారం ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎన్నికల ప్రచారంలో నగరిలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడుకు చేనేత కార్మికుల కష్టాలు వివరించి... నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని ప్రకటింపచేయడంలో భానుప్రకాశ్ కీలకపాత్ర పోషించారని చేనేత కార్మికులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, తడుకు సింగిల్ విండో ఛైర్మన్ చెరకుల కరుణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మతి తప్పి మాట్లాడుతున్న జగన్

**- టిటిడి మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఓవీ రమణ ఫైర్**



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి జగన్ ఓ మతి తప్పిన వ్యక్తిలా మాట్లాడుతున్నాడని టిటిడి మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఓవీ రమణ ఫైర్ అయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ఆయనే దిక్కన్నట్లు ప్రవర్తిస్తున్నాడని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పనన్న జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని, అధికారం చేపట్టిన వెంటనే కూల్చివేతలు ప్రారంభించారన్నారు. చంద్రబాబుపై అక్కసుతోనే అమరావతిపై విషం చిమ్ముతున్న జగన్ ప్రతిపక్షంలో ఉన్న విషయం మరచిపోయి అహంభావంతో వ్యవహారిస్తున్నడన్నారు. పార్లమెంటు తీర్మానం, రాష్ట్రపతి ఆమోద ముద్ర జరిగాక కూడా అమరావతి రాజధానిపై మాట్లాడడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు.జగన్ మావిగన్ పేరు పెట్టాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదం అన్నారు.

## చెరువులో అక్రమ కట్టడాలను తొలగించాలి



వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: పట్టణ నడిబొడ్డున ఉన్న అమ్మవారిపేట చెరువు భూముల్లో అక్రమంగా కబ్జా చేసి అక్రమ కట్టడాలు కట్టుకొని చెరువు నామరూపాలు లేకుండా చేస్తున్న కట్టడాలను తొలగించాలని, అమ్మవారిపేట చెరువును మంచినీటి కొలనుగా అభివృద్ధి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నియోజకవర్గ కార్యదర్శి పల్లెపాటి బాలకృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో అన్ని రకాల పెన్షన్ లు ఇవ్వాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి వారు మాట్లాడుతూ వెంకటగిరి పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న పట్టణం ఇలాంటి పట్టణంలో రోజురోజుకు భూ కబ్జాదారులు కూడా పెరిగిపోతున్నారు. సర్వే నెంబర్ 215లో సుమారు 36 ఎకరాల చెరువు భూమి ఉన్నది కానీ ఇప్పుడు అది 20 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురై చెరువు ఆవేదన జరుగుతున్నది 36 ఎకరాల విస్తీర్ణం గల భూమిలో కబ్జాకు గురైన భూమి విస్తీర్ణం విలువ 600 కోట్లకు పైగా ఉన్నది ఇంత విలువైన భూమిని ప్రజలకు ఉపయోగపడాల్సిన చెరువును కాపాడాల్సిన బాధ్యత మున్సిపాలిటీ రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇంత నష్టం జరుగుతుందని వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కచేపల్లి అంకయ్య, ప్రసాద్, మునుస్వామి, పెంచలయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు కె సుగుణ, తాళ్ళపాక రాజేశ్వరి, కుమారి, వి సుజన, గోవిందు విజయలక్ష్మి, నూకల రమణ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు భయపడం

**- వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి**



వెంకటగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: కూటమి నాయకులు పెడుతున్న అక్రమ కేసులకు భయపడమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పలు కేసులో అరెస్టై నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న రాష్ట్ర కార్యదర్శి, జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్య నారాయణరెడ్డిని ములాఖత్‌లో కలిసి పరామర్శించారు. కందుకూరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్, వైస్సార్సీపీ నాయకులు ఉన్నారు.

## వాకాడులో టిడిపి శ్రేణులు సంబరాలు



వాకాడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: లోకసభలో ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి గా ఏకగ్రీవ ఆమోదంతో చట్టబద్ధతతో తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మండల టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన వాకాడు అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా టిడిపి మండల కమిటీ ఆనంద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందన్నారు, అమరావతి రాజధానిని చట్టబద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి టిడిపి మండల కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## అమరావతి రాజధాని ఏర్పాటుకు ధన్యవాదాలు



వాకాడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానమేరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించినందుకు గాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపినట్లు మండల పరిషత్ ఏఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని ముగ్గులు వేసి, దీపాలను వెలిగించి థాంక్యూ సీఎం థాంక్యూ మోడీ అంటూ నినాదాలు చేసి రాజధానిగా అమరావతిని ఏర్పాటుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాలో ప్రతి కేసు మానవీయ దృక్పథంతో పరిశీలించాలి

**-సమన్వయంతో సమస్యను ఎదుర్కోవాలి-తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**





తిరుపతి,ఏప్రిల్ 2 ప్రభాతవార్త ప్రతినిధి: మానవ అక్రమరవాణా విషయంలో ప్రతి కేసును మానవీయ దృక్పథంతో సున్నితంగా విచారణచేయాలని ,పోలీస్, రెవెన్యూ,కార్మిక శాఖ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. ఇటువంటి నేరాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితుల రక్షణను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. మానవ అక్రమ రవాణా సంబంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సదస్సు గురువారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో బాధితుల గుర్తింపు, రక్షణ, పునరావాస చర్యలు, కేసుల దర్యాప్తు విధానాలపై సమగ్ర మార్గదర్శకాలు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, రామకృష్ణ, డిఎస్పీలు భక్తవత్సలం, విజయశేఖర్, శ్రీలత, గీతాకుమారి, ప్రసాద్,జిల్లాలోని డిఎస్పీలు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జై శ్రీరామ్ నినాదాలతో రామాలయం

**ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు**



తిరుపతి,ఏప్రిల్ 2ప్రభాతవార్త : రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమాద్ విజయోత్సవవేడుకలు వైభవంగా జరిగాయి .స్థానిక పెద్దకాపు వీధిలోని శ్రీరామ భజన మందిరంలో హనుమంతుని విగ్రహానికి పంచామృతాలు తో అభిషేకం నిర్వహించారు . సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాబలుడు శ్రీరామ దూత దాశ భక్తికి ప్రతినిధి హనుమజ్జయంతి ని నేడు అత్యంత వైభవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు హనుమంతుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమం లో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి, కే ఎన్ రాజా, సభ్యులు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎల్ కృష్ణయ్య,సుధాకర్ చౌదరి, శ్రీరామ భజన మందిరం సభ్యులు లక్ష్మమ్మ, అనిత, విజయమ్మ,తొండమనాటి చంద్రశేఖర్‌రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి,విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, అక్కిపల్లి మునికృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి రాజధాని సర్వత్ర ఆమోద్యయోగం.

**రేణిగుంట ఏప్రిల్ 2 ప్రభాతవార్త.** నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతి కావడం సర్వత్ర



హర్షనియమని తెలుగుదేశం పార్టీ నేతలు రేణిగుంట పట్టణంలో గురువారం సంబరాలు జరుపుకొని మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేతలు మాట్లాడుతూ అమరావతి రాజధాని కావడం ఆంధ్ర ప్రజల విజయం అన్నారు. ముఖ్యంగా రైతులు చేసిన త్యాగానికి ఫలితం లభించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చతురత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సాహసం, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహనం కలగలసి అమరావతి రాజధాని అయిందన్నారు. లోకసభ, రాజ్యసభల్లో బిల్లు పాస్ కావడం సర్వత్ర హర్షనియమని నేతలు అన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, సింగిల్ విండో అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, యువజన నాయకులు కిరణ్, సాగర్, టిడిపి మైనార్టీ నాయకులు నవాబు, పార్టీ సీనియర్ నాయకులు కొరియర్ రవి, రేణిగుంట క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్పనాదం, అన్నాసంపల్లి నాయకులు నాద ముని రెడ్డి, నెల్లూరు సుబ్రమణ్యం, ముచ్చెలి భాస్కర్ రెడ్డి జిల్లా రైతు సంఘం నాయకులు మునిస్వామి నాయుడు, వెంకటేష్ చౌదరి, మురళి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో ఎంపీడీవో రవిచంద్ర కు టిడిపి నేతలు మిఠాయిలు తినిపించారు. రేణిగుంట మండలం జి పాలెం పంచాయతీ కార్యాలయం వద్ద జి పాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి అమరావతి రాజధాని నగరంగా ఏకగ్రీవంగా బిల్ పాస్ అయినందుకు పంచాయతీ కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

## ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్టించకూడదా? : మూర్తి స్వామి..

రేణిగుంట ఏప్రిల్ 2 ప్రభాతవార్త



తన సొంత స్థలంలో శ్రీ ఆంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్టించడం నేరమా అంటూ శ్రీ రాజరాజేశ్వరి జ్ఞానపీఠం పీఠాధిపతి మూర్తి స్వామి ప్రశ్నించారు. గత కొన్ని నెలలుగా విగ్రహాన్ని ప్రతిష్టించాలని కార్యచరణ రూపొందించామన్నారు. ఊరేగింపుకు, ప్రతిష్టకు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుండి అనుమతులు తీసుకుందామన్నారు. అయితే సరిగ్గా ర్యాలీ జరిపి విగ్రహం ప్రతిష్టించాలనుకున్న తరుణంలో పోలీసులు అడ్డుకోవడం పై ఆవేదన వ్యక్తం చేశారు. తన సొంత స్థలంలో విగ్రహాన్ని ప్రతిష్టించడం తప్పేమి కంటూ ప్రశ్నించారు. ఈ విషయమై రూరల్ సీఐ మంజునాథరెడ్డిని వివరణ కోరగా మూర్తి స్వామి పోలీసు ఉన్నతాధికారులకు ర్యాలీ అనుమతి కోరిన మాట వాస్తవమని, అయితే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తెలియజేయాల్సిందిగా కోరడంతో కొన్ని పరిస్థితుల దృష్ట్యా ర్యాలీకి అనుమతించడం సరికాదని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ర్యాలీకి పర్మిషన్ ఇవ్వలేదని ఆయన ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు.

## అమరావతి రాజధాని బిల్లు ఆమోదం చారిత్రాత్మకం



***తిరుచానూరు ఏప్రిల్ 2 ప్రభాతవార్త.*** అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం ఒక చారిత్రాత్మక విజయమని రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సీఆర్ రాజన్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్వగృహం వద్ద పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు...అమరావతి రాజధానికి రక్షణ కల్పించిన ఈ రోజు రాష్ట్ర ప్రజలకు శుభదినమని ఆయన కొనియాడారు. రాజధాని బిల్లుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరియు లోక్‌సభకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో త్వరలోనే అమరావతి ఒక అద్భుత నగరంగా ఆవిష్కృతం కాబోతోందని డాక్టర్ రాజన్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీమాంధ్రుల కలల రాజధాని అయిన అమరావతి, ప్రపంచం మెచ్చిన నగరంగా అవతరించబోతోందని అన్నారు. అమరావతి కోసం పోరాడిన మంత్రి నారా లోకేష్, కూటమి పక్షాలకు సహకరిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.అమరావతి ప్రాంత రైతులు మరియు మహిళలు చేసిన త్యాగాలు వృధా కాలేదని డాక్టర్ రాజన్ అన్నారు. గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడి రాజధానిని దెబ్బతీయాలని చూసినా, అది సాధ్యం కాలేదని విమర్శించారు. జగన్ ఎన్ని ఎత్తులు వేసినా అమరావతిని ఏమీ చేయలేరని, ప్రజలు మరోసారి వైకాపాకు అవకాశం ఇచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో రాజధాని బిల్లుకు మద్దతు ఇవ్వకుండా వైకాపా సభ్యులు వాకౌట్ చేయడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని డాక్టర్ రాజన్ తీవ్రంగా మండిపడ్డారు. సొంత ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టుపెట్టడంవైకాపాకుఅలవాటుగామారిందని,ప్రజలేవారికితగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## సర్పంచ్లకు ఘన సన్మానం



**తొట్టంబేడు ఏప్రిల్ 2 ప్రభాతవార్త** ఐదేళ్ల పాటు పరిపాలించిన సర్పంచుల పదవి కాలం ముగిసింది. గురువారం తొట్టంబేడు మండల ప్రజా పరిషత్ సమావేశ హాలులో గ్రామ సర్పంచుల పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షురాలు పున్నం నిర్మల మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి సర్పంచులందరూ చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. అదేవిధంగా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. సురేంద్రనాథ్ మాట్లాడుతూ, 2021–2026 ఐదేళ్లపాటు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, గ్రామాభివృద్ధికి కృషి చేసి, ప్రజలకు ఉన్నత సేవలు అందించిన తొట్టంబేడు మండలంలోని గ్రామ సర్పంచులందరి సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. పదవులు లేకపోయినా ప్రజలకు సేవ చేయాలని, మళ్లీ మంచి పదవులు పొంది ప్రజా సేవలు అందించాలని ఆయన వారిని ఆశీర్వదించారు. సర్పంచులకు ఇంకా ఏవైనా బకాయిలు ఉంటే, వాటిని చెల్లించాలని ఆయన సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గ్రామ సేవల్లో సర్పంచులు తమకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎంతో సహకారం అందించారని పలువురు పంచాయతీ అభివృద్ధి అధికారులు తెలిపారు. అనంతరం, ఎంపీపీ, ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ, పీడీఓలు కలిసి సర్పంచులను పూలమాలలు వేసి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో వాయవేడునాయుడు, డిప్యూటీ ఎంపీడీఓలు గిరిధర్ భార్గవ సత్యం, పంచాయతీలోని సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పెద్దలకు కొమ్ముకాస్తున్నారు



తొట్టంబేడు ఏప్రిల్ 2 ప్రభాతవార్త

పెద్దలకు, పెత్తందార్లకు రెవెన్యూ యంత్రాంగం కొమ్ముకాస్తోందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ ఆరోపించారు. తమకు, తమ భూములకు పెత్తందార్ల నుంచి రక్షణ కల్పించాలంటూ తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామానికి చెందిన గిరిజనులు కేవీపీఎస్, గిరిజన, ఎరుకల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. వీరికి కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ సంఘీభావం తెలిపారు. ఈశ్వరమ్మ మాట్లాడుతూ పూడిలోని ఎరుకుల తెగకు చెందిన కంపా గోపాల్, మరికొన్ని కుటుంబాలకు న్యాయం చేయాలని స్వయంగా ఎస్టీ కమిషన్ చెప్పినా ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నించారు. పెద్దలకో న్యాయం.. పేదలకో న్యాయమా..? అంటూ నిలదీశారు. అక్కడి పెత్తందారులైన నరసింహులు నాయుడు మాధవ నాయుడు, రత్నయ్య నాయుడు గిరిజనులను ఇబ్బంది పెడుతూ, భూమిలోకి అడుగుపెట్టనీయకుండా దౌర్జన్యానికి దిగుతున్నా అడిగే నాథుడు లేకుండాపోయారని వాపోయారు. గత రెండు రోజులుగా సాక్షాత్తు ఆర్డీవో కార్యాలయం ఎదుటే నిరసన తెలుపుతున్నా శ్రీకాళహస్తి ఆర్డీవో కనీసం బాధితులను పరామర్శించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గిరిజనులకు న్యాయం చేయకుంటే ఆమరణ నిరాహార దీక్షకు సైతం పూనుకుంటామని హెచ్చరించారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, కేవీపీఎస్ నాయకులు గంధం మణి, గురవయ్య, వేణు, బాధితులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆనవాళ్ళు ఆధునిక నిర్మాణాలు

### రూ.1.15 కోట్లతో విద్యుత్ కార్యాలయ నూతన భవనం
### ఎంఎల్ఏ పులివర్తి నాని

చంద్రగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



అభివృద్ధికి ఆనవాళ్ళు ఆధునిక నిర్మాణాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన నూతన భవన నిర్మాణఫానికి భూమి చేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. నూతన భవన నిర్మాణానికి ఎంఎల్ఏ చేతుల మీదుగా అర్చకులు భూమి పూజ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృసి చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2 ఏళ్ళలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చంద్రగిరి సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయ ఆవరణలో రూ.1.15 కోట్లతో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, ప్రముఖ వ్యాపార వేత్త, క్లాస్ 1 కాంట్రాక్టర్, టిడిపి నాయకుడు ఏవి రమణమూర్తి, విద్యుత్‌శాఖ అధికారులు తిరుపతి జిల్లా, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్) చంద్రశేఖర్ రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (సివిల్) ఎస్.తిరుమల రావు, ఈఈ ఎం.చిన్నరెడ్డెప్ప, ఏడిఈ శేషాద్రి రెడ్డి, ఏఈలు వై.నాగరాజు, పి.శ్రీనివాసులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, సింగిల్ విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూరు ధనంజయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

చంద్రగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఒక వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెంది పడివుండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని ప్రాథమిక విచారణ జరిపారు. వివరాల్లోకెళితే.. తిరుపతి రూరల్ మండలం, కుంట్రపాకం దళితవాడకు చెందిన మహేష్‌బాబు (30) తన భార్యకు దూరంగా వుంటున్నాడు. కడప జిల్లా, ఎర్రగుంట్లకు చెందిన మీనాకుమారితో ఒకటిన్నర సంవత్సరాలుగా సహజీవనం సాగిస్తున్నాడు. మీనాకుమారి భర్తను వదలి తన ముగ్గురు పిల్లలు, మహేష్‌బాబుతో కలసి భాకరాపేటలో కొంత కాలం వున్నారు. ఈ మధ్యనే చంద్రగిరి, విజయనగర్ కాలనీకి మారారు. అయితే ఇక్కడ ఇద్దరికీ కొంత మనస్పర్థలు ఏర్పడటంతో మృతుడి సోదరుడు వచ్చి ఇద్దరికి నచ్చజెప్పి వెళ్ళాడు. మృతుడు గురువారం వేకువజామున బహిర్భూమికి వెళ్ళి వస్తానని తిరిగి ఇంటికి రాలేదు. మార్కెట్ యార్డు ప్రహరిలోపలి వైపున శవమైపడివున్నాడు. కుటుంబ సభ్యులు ఇక్కడికి చేరుకుని మహేష్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పాలిసెట్‌కు ఉచిత శిక్షణా తరగతులు

### ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషాదేవి

చంద్రగిరి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:

పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు చంద్రగిరి (అగరాల వద్ద గల) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 4 నుండి 23 వరకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషాదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ తరగతులు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9502601571 నంబర్‌కు సంప్రదించాలని ఆన్నారు. ఈ ఉచిత శిక్షణకు పాలిసెట్ కో ఆర్డినేటర్‌గా పి.భక్తవత్సలం, పాలిసెట్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్‌గా ఎం.నరశింహులు వ్యవహరించ నున్నట్లు తెలిపారు.

## స్విమ్స్ యాజమాన్యానికి తుది గడువు

- ఏప్రిల్ 5 నుంచి కార్మికుల పోరాటం ఉధృతం
- హామీలు కాదు – తక్షణం సమస్య పరిష్కారం కావాలి

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త



సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి స్విమ్స్ కార్మికులు గత నాలుగు సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమైన స్థాయికి చేరుకున్నాయి. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగి, కార్యాలయాల ముందు ప్రదక్షిణలు చేసి, కరపత్రాలు పంచి, నిరసనలు తెలియజేసినా యాజమాన్యం స్పందించకపోవడం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహాన్ని రగిలిస్తోంది. కార్మికుల కష్టాన్ని వినియోగించుకుంటూ, వారి హక్కులను మాత్రం నిర్లక్ష్యం చేయడం యాజమాన్యం ద్వంద్వ వైఖరికి నిదర్శనం. స్విమ్స్ కార్మికులు చేస్తున్న పోరాటం నేటికి 35వ రోజుకు చేరుకున్నది. అధికారులు ఇచ్చిన మార్చి 31 గడువు పూర్తయినా, యాజమాన్యం పదేపదే మాట తప్పుతూ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోంది."గడువు మీద గడువు అడిగి చివరికి మాట తప్పడం ద్వారా కార్మికులను మోసం చేయడమే జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 5వ తేదీ నుంచి పోరాటాన్ని మరింత ఉధృతంగా తీసుకెళ్తామని నేడు స్విమ్స్ డైరెక్టర్‌ను కలిసి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్, స్విమ్స్ యూనియన్ నేతలు వినతిపత్రం సమర్పిస్తూ స్పష్టం చేశారు. గతంలో 2025 జూన్‌లో జరిగిన నిరాహార దీక్షల సమయంలో ఉన్నతాధికారులు మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదు. మూడు నెలలు తొమ్మిది నెలలు అయినా పరిష్కారం కాని పరిస్థితి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోంది. డిసెంబర్‌లో సమ్మె నోటీసు ఇచ్చినా, జనవరి నుంచే సమ్మెలోకి వెళ్లే అవకాశాన్ని కార్మికులు వదులుకుని మరోసారి సహనం చూపించారు. కానీ ఆ సహనాన్ని యాజమాన్యం బలహీనతగా భావించడం పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా కార్మికులను తిప్పలు పెట్టిస్తూ, హామీలు ఇచ్చి మాట తప్పడం యాజమాన్యం అలవాటుగా మారింది. రెండు రోజుల్లో పరిష్కరించగలిగే సమస్యలను కావాలనే లాగడం వెనుక ఉద్దేశం ఏమిటి? కార్మికుల సహనాన్ని పరీక్షించే ప్రయత్నం ఇక మానుకోవాలి" అని ఘాటుగా ప్రశ్నించారు. 35 రోజులుగా కార్మికులు శాంతియుతంగా పోరాటం చేస్తున్నప్పటికీ, దాన్ని బలహీనతగా భావిస్తే అది యాజమాన్యానికి పెద్ద పొరపాటు అవుతుంది. ఇకపై సహనం ముగిసింది. ఏప్రిల్ 5వ తేదీ నుంచి కార్మికులందరూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు. ఇది సాధారణ నిరసన కాదు – యాజమాన్యాన్ని కుదిపే స్థాయిలో ఉండే ఉద్యమం అని హెచ్చరించారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగదు. అవసరమైతే మరింత ఉధృత రూపం దాల్చి ఆసుపత్రి వ్యవస్థనే కుదిపే దిశగా సాగుతుంది. ఇప్పటికైనా సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే, ఏప్రిల్ 5 తర్వాత జరిగే ప్రతి పరిణామానికి, నష్టాలకు పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాల్సి ఉంటుంది అని స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యత, పోరాట సంకల్పం ముందు ఎలాంటి అడ్డంకులైనా నిలవలేవని, హక్కులు సాధించేంతవరకు ఈ ఉద్యమం మరింత తీవ్రతతో ముందుకు సాగుతుంది అని సిఐటియు నాయకులు గట్టిగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిమ్స్ యూనియన్ కార్యదర్శి జి. రవి, అధ్యక్షులు వి. సూరి, కోశాధికారి మారి ముత్తు, గోపి, మునికృష్ణ, మునేంద్ర, పి. వెంకటేష్, జనార్ధన్, రాజా, బి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతి

ఏర్పేడు,ఏప్రిల్ 2 ప్రభాతవార్త

ఏర్పేడు మండల కేంద్రంలో గత కొంత కాలంగా బిక్షమెత్తుకొని జీవిస్తున్న ఓ 60 సంవత్సరాల వృద్ధురాలు విజయలక్ష్మీ సినిమా హాలు వెనుక గుంతలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. తమిళం,తెలుగులో మాట్లాడూతూ సంచరించే ఆమె పేరు ఏమిటో తెలియదు.ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు.బుధవారం కూడా సంచరించిన ఆమె గురువారం గుంతలో పడి చనిపోవడం గమనిస్తే ప్రమాదవశాత్తు కాలు జారి పడినట్లు తెలుస్తుందని ఎస్ఐ రవిప్రకాష్ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## వైసీపీ సర్పంచ్‌లకు ఘన సన్మానం

కేవీబీ పురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



వైసీపీ సర్పంచ్‌లకు సత్యవేడు నియోజకవర్గ వైసీపీ నూకతోటి రాజేష్‌చే ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం కేవీబీ పురం వైసీపీ కార్యాలయంలో మండల వైసీపీ నాయకుడు గవర్ల కృష్ణయ్య సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ నాయకుడు రాజేష్ పాల్గొని మండలంలోని వైసీపీ సర్పంచ్‌లను శాలువలతో సత్కరించారు. అనంతరం నూకతోటి రాజేష్ మాట్లాడుతూ తమ పదవీ కాలంలో రూపాయి సంపాదించుకోలేదని సర్పంచ్‌లందరూ ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, ఇంకా మూడేళ్లు మనం వేచి ఉండాలని రాబోయేది వైసీపీ జగన్ అని ప్రతి సర్పంచ్‌కు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, నేనున్నానని అన్ని విధాల సహకరిస్తానని తెలిపారు. 6వ తేదీ లోపు ఎవరైనా కమిటీ చేరదలచిన వారు వివరాలు ఇస్తే ఐడీ కార్డులు ఇప్పిస్తామని నియోజకవర్గం కేవీబీ పురం మండలం అధికంగా చేరారరి, అది ఒక కృష్ణయ్య గణతేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్, పాడి లాల్ బాబుయాదవ్, దశరథరామిరెడ్డి, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, జడ్పీటీసీ జిల్లానాయకురాలు గుర్రం మాధవిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాము, ఎంపీటీసీ అయ్యప్ప, స్థానిక సర్పంచ్ గిరిరెడ్డి, బాల మనీ, పూడిమణి, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రీ సర్వేలో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ: ఎమ్మెల్యే

కేవీబీ పురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:





మండల కేంద్రమైన కేవీబీ పురం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం రీ సర్వేలో రైతులకు వారి భూమి పట్టాదారు పాసు పుస్తకాలను రాజముద్రలతో వేసి పంపిణీ కార్యక్రమం తహసీల్దార్ తనూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని మాట్లాడుతూ ఆ నాడు తెలుగుదేశం పార్టీ రైతులకు, ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను చేపడతామని హామీ ఇచ్చిందని, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా జగన్ రైతుల భూమి పట్టాదారు పాస్ పుస్తకాల్లో తన ఫోటో ముద్రలు వేసుకున్నాడని ఇది ఎంత వరకు సమంజసం అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, లోకేష్‌లు కలసి రైతులకు వారి వివరాలే ఉండి రాజముద్ర ఇవ్వాలన్న సంకల్పంతో ఆయన నాడు వాగ్దానాన్ని నేడు నిజం చేసి నిరూపించారిన తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలో కల్యాణ మండపం ఏర్పాటుకు ప్రతిపాదన పంపామని దాని పనులు కూడా పూర్తి చేస్తానని, నేను ఎవరిపైనా కక్ష సాధింపు చేయనని, విద్యశాఖలు ద్వారా కోట్లాది రూపాయలు తెచ్చి పాఠశాల భవన నిర్మాణం జరిపారని, 33 కోట్లతో నిధులు ఖర్చు పెట్టానని నేను ఒంటరిగానే పోరాడి గెలిచానని తెలిపారు. మండలానికి ఎన్నో విధాల కోట్ల నిధులు తెప్పించాలని రైతులకు సాగు చేస్తున్న భూములకు ఫారెస్టు వారి ద్వారా న్యాయం చేయాలని అసెంబ్లీలో మాట్లాడానని రాజ్యాంగ బద్ధంగా చట్టప్రకారం నాంది పలకాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తనూజ, వీఆర్వో ముని భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, కరుణాకర్, విజయకుమార్ నాయుడు, సుదర్శన్‌నాయుడు,రమేష్, బాలాజీ, చెంగారెడ్డి, పిచ్చాటూరు తెలుగుదేశం పార్టీఅధ్యక్షుడుఇళంగోవన్,పంచాయతీరాజ్‌డీఈకాత్రపల్లిమురగయ్య, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ - ఎమ్మెల్యే

కేవీబీ పురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో గురువారం 10 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రధాన రహదారి తహసీల్దార్ కార్యాలయం వరకు వేసిన సిమెంటు రోడ్డుని ఎమ్మెల్యే ఆదిమూలం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తనూజ, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్పంచ్ బాలాజీ, మనీ, పిచ్చాటూరు తెలుగుదేశం పార్టీ నాయకుడు ఇళంగోవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మన రాజధాని అమరావతే

సత్యవేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో తెలుగు తమ్ముళ్లుమన రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించిన ఈ శుభవేళ, ప్రజా రాజధాని వెలుగులతో నిండాలి మన రాష్ట్ర భవిష్యత్ కోసం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు, అలుపెరగని పోరాటం రైతుల త్యాగానికి దక్కిన మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సదవాలమ్మకు టెంకాయలు కొట్టి రాజధాని అమరావతి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అంటూ జేజేలు కొట్టారు. మనమందరం ఏకమై ఇళ్ళ ముందు దీపాలు వెలిగిద్దాం అమరావతి రాజధానికి నీరాజనాలు పలుకుందాం. ప్రజా రాజధానిని కాపాడుకుంటామని ప్రతినబూసనుదాం. అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బాషా, నాయకులు కిష్టయ్య, రాధయ్య, హేమభూషణం, శశినాయుడు, సంతోష్, పృథ్వీ రాజ్, గుర్రప్ప, పయణి, అమాసరెడ్డి, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవయదానం అవగాహన కల్పించడం కోసం ర్యాలీ

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:




ప్రజలకు అవయదానంపై అవగాహన కల్పించడం కోసం కమ్యూనిటీ పేరామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నారు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం పది గంటలకు అన్నమయ్య సర్కిల్ నుండి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిధిగా డి ఎన్ఆర్ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మెన్ డాక్టర్ డి.నారాయణ రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ర్యాలీ యూత్ హాస్టల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏ.విజయ్ కుమార్, భూపతి, నాగిరెడ్డి, వేణు, ప్రేమ్ కుమార్, కల్పన, మునస్వామి, శశి రేఖ, చిరంజీవి, డివిజన్ సభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సర్పంచుల పదవీకాలం ముగింపు

### -ఘనంగా వీడ్కోలు పలికిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు



శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని శ్రీకాళహస్తి మండల సర్పంచుల పదవీకాలం నేటితో ముగియనున్న నేపథ్యంలో వారిని గౌరవిస్తూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచుల అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల కాలంలో తనపై నమ్మకంతో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల పంపిణీలో వారు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. గతంలో మనం చేసిన మంచిని చెప్పుకోలేక ఓడిపోయామని కానీ నేడు ప్రజలు మనం చేసిన మంచిని కోల్పోయినందుకు చాలా బాధపడుతున్నారు అన్నారు. అంతకుముందు, తమపై పూర్తి విశ్వాసంతో తమకు సర్పంచ్ పదవులను కట్టబెట్టి, గ్రామాల అభివృద్ధికి దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మధుసూదన్‌రెడ్డిని గజమాలతో సత్కరించి, పుష్పాభిషేకం నిర్వహించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ తమకు సర్పంచులుగా పనిచేసే అవకాశం కల్పించి, నిరంతరం అండగా నిలిచిన మధుసూదన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని సర్పంచులు ఉద్వేగంతో తెలిపారు.

## అమరావతికి చట్టబద్ధత...కేంద్రం నిబద్ధత



తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు మండల నాయకులు మండల కార్యాలయం నందు రావిళ్ళ ముని రాజా నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా బాణా సంచా కాల్చి సీట్లు పంచి సంబరాలు గురు వారం జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజనాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఐదుకోట్ల ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజారిటీతో పార్లమెంటు ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ విద్యాఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు, సింగిల్ విండో చైర్మన్ భీమల భాస్కర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి మణి, గుర్రప్ప నాయుడు కండిగ లెక్కల మురళి నాయుడు, తొట్టంబేడు మండల తెలుగు యువత అధ్యక్షుడు వట్టికుండల పవన్ నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సర్పంచ్ మాధవి, ఆయా కట్టు వైస్ చైర్మన్ ఘట్టమనేని శంకర్ నాయుడు, జనసేన నాయకుడు అంజూరు చక్రధర్ ,క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా విద్యకు ప్రోత్సాహం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సుమారు 75 సంవత్సరాల క్రితం ఆధ్యాత్మిక నిలయంగా మలయాళ యతీంద్రుల శిష్యులు విద్యాప్రకాశానందగిరి స్వామి ఇక్కడ శుకబ్రహ్మాశ్రమాన్ని స్థాపించి ఆధ్యాత్మిక చింతనతో పాటు మహిళకు సంస్కృత విద్యను అందించుటకు కృషి చేశారని ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వ రూపా నందగిరి స్వామి అన్నారు. ఇక్కడి ఆశ్రమంలో జరుగుతున్న 76వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సభలో విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాదించిన విద్యార్థి 'స్రవంతికి' ప్రోత్సాహక బహుమతిని అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1967లో ఇక్కడి ప్రజలకు ఉన్నత విద్యను అందించుటకు డిగ్రీ కళాశాలకు కార్పస్ ఫండ్‌ను అందించి ప్రోత్సహించారని వివరించారు. దాంతో ఇక్కడి ప్రజలు తిరుపతి ఇతర ప్రాంతాలకు వెళ్ళి బాధను తగ్గించారు. అలాగే 1984లో ఇక్కడి మహిళలకు విద్యావకాశాలు కల్పించుటకు మరో సారి ప్రభుత్వానికి చెల్లించాల్సిన కార్పస్ ఫండ్‌ను చెల్లించారన్నారు. మహిళలకు ఉన్నత విద్యను అందించుటకు మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించారన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలకు 'విద్యాప్రకాశానంద' పేరు పెట్టడం గమనిస్తే విద్యారంగంలలోనూ, మహిళా విద్యకు స్వామి ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనంగా ఉందని పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో మొదటి స్థానం సాధించిన స్రవంతికి బహుమతి అందించి ఉన్నత విద్యతో తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆశీర్వదించారు.

## ఆంధ్రులు కలలు గన్న రాజధాని అమరావతి

### -ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఆంధ్రులు కలలుగన్న రాజధాని అమరావతి నగరం అని ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. పార్లమెంటులో అమరావతి రాజధాని బిల్లుకు చట్టబద్ధతగా ఆమోదం లభించడంతో గురువారం రాత్రి కుప్పంలో కూటమి నేతలు సంబరాలను నిర్వహించారు. తొలుత స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు .ఈ సందర్భంగా ఆర్టీసీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ అమరావతి ప్రాంత రైతుల త్యాగ ఫలితమే అమరావతి రాజధాని నిర్మాణం అని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాజధాని లేకుండా మూడుముక్కలాట ఆడిందని ఆయన పేర్కొన్నారు. రాజధానికి చట్టబద్ధత కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడు చేసిన శ్రమ ఫలించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్, ప్రేమ్‌కుమార్, రెస్కో చైర్మన్ ప్రతాప్ కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు జిమ్ దాము సోమశేఖర్ ,మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సతేంద్ర శేఖర్, జనసేన ఇన్‌చార్జ్ నరేష్, బిజెపి ఇన్‌చార్జ్ తులసీనాథ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సీఎం చంద్రబాబు

### -ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: అమరావతి రాజధానితో సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని ప్రభుత్వ విప్, కడ పీఏసీ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో రాజధాని అమరావతి నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. వైకాపా పాలనలో రాజధాని లేకుండా చేయాలని మూడు ముక్కలాటకు వైయస్ జగన్ తెర లేపారని పేర్కొన్నారు. ఎన్నో ఆటంకాలు, కుట్రలు ఎదుర్కొన్న అమరావతి రాజధాని నగర నిర్మాణం ఇకపై సీఎం చంద్రబాబు నాయుడు అకుంఠిత దీక్షతో ప్రజా రాజధానిగా నిలిచిపోతుందన్నారు. పార్లమెంటులో అమరావతి రాజధాని నగరంగా చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## మానసిక గందరగోళంలో జగన్




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని చూసి ఓర్చుకోలేని జగన్‌రెడ్డి మానసిక గందరగోళంలో ఉన్నాడని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. రాజధానిగా అమరావతిని నిర్ణయించి దానికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభ మరియు రాజ్యసభలో ఆమోదం పొందిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక పూసల వీధి కూడలిలో భారత సంవిధాన చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అనంతరం స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా.జి.దశరథాచారి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మిన్నల్ రవి, రెడ్డివారి గురవారెడ్డి, డి.వి.నారాయణ, డా.యం.ఉమేష్ రావు, యం.సుబ్బయ్య, వజ్రం కిషోర్, బీమాల భాస్కర్, షేక్ మహబూబ్ బాషా, కోట చంద్రశేఖర్, మహేష్ రెడ్డి, మణి, గంగనపల్లి రమేష్, గాజుల భగత్, ఆనంద్ రెడ్డి, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి, చంద్రబాబు, సులేమాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## అప్పు అడిగినందుకే హత్య : డీఎస్పీ



గంగవరం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: అన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన సుబ్రమణ్యంను తీసుకున్న అప్పును తిరిగి చెల్లించాలని చంద్రమ్మ మొండి కేయడంతోనే హత్య చేసి అడవిలో పడేసినట్లు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం పలమనేరు సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పెద్దపంజాణి మండలం చలమంగళం పంచాయతీ ఎగువ మిద్దెపల్లెకు చెందిన చంద్రమ్మ(33) మార్చి 30న అదృశ్యమై పలమనేరు పట్టణం జగమర్ల అటవీ ప్రాంతంలో శవమై తేలిన విషయం పాఠకులకు విదితమే. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో గంగవరం రూరల్ సిఐ పరశురాముడు, ఎస్ఐ మారెప్ప తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా చంద్రమ్మకు సన్నిహితంగా ఉండే అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంను మార్చి 31న రాత్రి ముత్తూకూరు క్రాస్ సమీపంలోని ఫీడ్ పరిశ్రమ బస్‌స్టాప్ వద్ద కంగారుగా తిరుగుతుండడంతో అనుమానం వచ్చి అతని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. సుబ్రమణ్యం చంద్రమ్మ వద్ద నెలవారి చీటీలు వేసి మొదట్లోనే చీటిలను ఎత్తుకోవడంతో పాటు ఆమె వద్ద మరో రూ.40 వేలు అప్పుగా తీసుకున్నాడని, మొత్తం నగదు రూ.2 లక్షల వరకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో పోగొట్టుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో నెలవారి చీటీలకు, తీసుకున్న అప్పును, వడ్డీను చంద్రమ్మ పదేపదే అడుగుతూ తనని హింసిస్తుండడంతో విరక్తి చెందిన నిందితుడు ఆమె దగ్గర తీసుకున్న డబ్బు ఎగిరిపోవడంతో పాటు ఆమె దగ్గర దాచుకున్న డబ్బును అతని విలాసాల కోసం ఎలాగైనా కాజేయాలని తాను ముందుగా రచించిన పథకం ప్రకారం మార్చి 30న చంద్రమ్మ వద్దకు వచ్చి ఇప్పుడు నువ్వు నాతో వస్తే నేను నీ దగ్గర తీసుకున్న అప్పుతో పాటు మొత్తం డబ్బు ఇచ్చేస్తాను నాకు నిడిగుంట గ్రామంలో వేరేవాళ్ళు ఇవ్వాలి అంటూ ఆ అమాయకురాలిని నమ్మించి తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్ళి లింగాపురం వైపుగా బయలుదేరి సమీపంలోని మిలటరీ మామిడితోపులోనికి తీసుకెళ్ళాడు. అప్పటికే మామిడితోపులో మాటువేసిన జంగాలపల్లెకు చెందిన దేవివరప్రసాద్, బైరెడ్డిపల్లె మండలం చిన్న చెల్లారుగుంట గ్రామానికి చెందిన నూర్‌మహమ్మద్‌అనే ఇద్దరు మిత్రులతో కలిసి ఇనుప రాడ్లతో తల వెనుక మోది, కత్తులతో శరీరంపై గాయాలు చేసి గొంతు కోసి దారుణంగా అక్కడే హతమార్చినట్లు తెలిపారు. హత్య అనంతరం ఆ మహిళ శవాన్ని రాత్రి 10 గంటల సమయంలో బొలోరో వాహనంలో తీసుకువచ్చి జగమర్ల అడవీ ప్రాంతంలో పడేసి వెళ్ళిపోయినట్లు ఆయన తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. మహిళ హత్య జరిగిన రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన సిఐ పరశురాముడు, ఎస్ఐ మారెప్ప బృందాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించారు.

## అమరావతికి మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ



పుల్లంపేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చిరస్మరణీయమని పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ బాధ్యుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు అన్నారు. గురువారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ అభిమానులు నాయకులతో కలిసి మండల కేంద్రమైన పుల్లంపేటలో భారీ ఎత్తున కొవ్వొత్తుల ప్రదర్శన, బాణసంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అమరావతి కోసం కృషి చేసిన వివిధ పార్టీల నాయకులందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేశినేని నారాయణ నాయుడు మారోతు మల్లికార్జున పసుపులేటి సుబ్బయ్య మీనాక్షి సుబ్బరాయుడు దిగదారి శంకర నూకల శరణం తెలుగు మహిళా నాయకురాలు కేశినేని రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

## కమనీయం... శ్రీ సీతారాముల కళ్యాణం



చిట్వేలి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: స్థానిక మండల పరిధిలోని ఏగువపల్లి గ్రామంలో గురువారం శ్రీ సీతారాముల కళ్యాణంను కమనీయంగా నిర్వహించారు. కస్తూరి చిన్నయ్య కుటుంబ సభ్యులు స్వామి వారి కళ్యాణం, రాజేష్ కుటుంబ సభ్యులు మధ్యాహ్నం అన్నదాన దాతలుగా నిలిచారు. కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి కల్యాణాన్ని విక్షించారు. గ్రామాలలో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో అనుబంధాలు, ఐక్యత మరింత పెంపొందుతాయని మాచినేని తెలిపారు. భగవత్ స్వరూపమైన శ్రీరాముడు మనిషి రూపాన జన్మించి, మానవాళికి మార్గదర్శకం చూపారని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దివ్యమైన సుమూహూర్తంలో కుంబాభిషేకం



ఏర్పేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయం కుంబాభిషేకం నిర్వహించటం శుభసూచకమని కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అన్నారు. గుడిమల్లం ఆలయంలో ఈ నెల 18 నుంచి 23వరకు నిర్వహించే మహా కుంబాభిషేకానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి, వేదపండితులు స్వామిని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ అతిపురాతనమైన ఆలయాల్లో గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయం. ఇక్కడ పురావస్తుశాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారని ఇక్కడి విగ్రహం ప్రత్యేకంగా ఉంటుందని అంతేకాక కాక ఆలయ నిర్మాణం కూడా ప్రత్యేక శైలిలో ఉంటుందని స్వామి వివరించారు. ఈ ఆలయంలో ఇంత కాలానికి కకుంబాభిషేకం నిర్వహించుటకు నిర్ణయించిన మీరు ధన్యులని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చైర్మెన్, ఇఒలు స్వామి స్వహస్తాలతో కుంబాబిషేకం నిర్వహించాలని కోరారు. పీఠాధిపతి సాధ్యమైనంత వరకు కుంబాభిషేకానికి హాజరౌతానని భరోసా ఇచ్చినట్లు చైర్మెన్ బత్తల గిరినాయుడు వివరించారు. వారితో పాటు వేదపండితులు, ఆలయ పూజారి పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

## అమరావతికి పుత్తూరు టిడిపి నేతలు సంఘీభావం



పుత్తూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా పార్లమెంట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి పుత్తూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఇకపై ఎవరూ రాజధాని అమరావతిని ఒక్క అంగుళం కూడా కదిలించలేరని తెలిపారు. వేలాది మంది రైతుల త్యాగాలకు న్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా రూపుదిద్దుకుంటుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎన్. ధనపాల్, సీనియర్ నాయకులు బాబునాయుడు, వెంకటముని, బి.ఆర్.మురళీధర్, వినోద్‌రాయల్, గిరి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

### -విద్యార్థులకు రక్షణపై మార్గదర్శకాలు.



తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త: సమాజంలో జరుగుతున్న పలు రకాల నేరాలకు సంబంధించి తెలియని, ముఖపరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా మెలగాలని శక్తిటీం పోలీసులు అవగాహన కల్పించారు. మహిళల భద్రత ,విద్యార్థినులకు రక్షణపై తిరుపతి జిల్లా పోలీసులు మార్గదర్శకాలు రూపొందించారు. అభివృద్ధి చెందిన సాంకేతిక వినియోగంపై జాగ్రత్తలు తెలిపేలా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి మహిళా డిఎస్పి శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీం పోలీసులు మహిళలకు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై విస్తృత అవగాహన కల్పించారు. శక్తి యాప్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో 112 కాల్ సేవల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

## అమరావతి రాజధాని చట్టం ఆమోదం శుభ పరిణామం

### - రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ



తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని పార్లమెంట్లో ఆమోదించడం శుభ పరిణామమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తెలిపారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు చరిత్రలో సువర్ణ అక్షరాలతో నిలిచిపోతాయన్నారు. గురువారం సాయంత్రం తిరుపతి బైరాగిపట్టెడలోని అన్న క్యాంటీన్ వద్ద టపాకాయలు పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## ఆస్తి పన్ను వడ్డీ మాఫీ గడువు...ఈనెలాఖరుకు పొడిగింపు

తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త : తిరుపతి నగరంలో నివాసముంటున్న ప్రజలు చెల్లించాల్సిన, బకాయి పడిన ఆస్తి పన్ను చెల్లింపులకు వడ్డీమాఫీ గడువు ఈ నెలాఖవరుకు పొడిగించినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 50శాతం వడ్డీ మాఫీతో ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని ప్రజలు వినియోగించు కోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 50 శాతం మాఫీ చేసే పథకాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గతంలో మార్చి 31 వరకు ఇచ్చిన గడువులో ఉగాది, రంజాన్ వంటి పండుగ సెలవులు రావడంతో పన్ను చెల్లింపుదారులకు తగిన సమయం లభించలేదని ప్రభుత్వం గుర్తించి ,చాలా మంది బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోలేక పోయారని భావించి గడువును పెంచిందని ఆమె తెలిపారు. ఈ పొడిగించిన కాలంలో బకాయిల చెల్లింపులకు నగరపాలకసంస్థకు సహకరించాలని ఆమె కోరారు.

## కడు రమణీయంగా ఊంజల సేవ



తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త :తిరుపతి పెద్దకాపు వీధిలో వెలసిన శ్రీరామ భజన మందిరం నందు నవమి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం సాయంత్రం సీతారాములకు ఊంజల సేవ కడు రమణీయంగా నిర్వహించారు. స్థానికులు ఈ ఊంజల సేవలో పాల్గొని సీతారాములను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏ బాబు రాజేంద్రప్రసాద్, ఏ రమేష్ బాబు కుటుంబ సభ్యులు ఈ రోజు ఊంజల సేవలో ఉభయదారుల వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండము నాటి చంద్రశేఖర్‌రెడ్డి, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయమ్మ, లోక ప్రభాకర్ నాయుడు, లక్ష్మమ్మ, ముని కృష్ణయ్య తదితర భక్తులు పాల్గొన్నారు

## ప్రపంచ ఆటిజం దినోత్సవంలో మాజీ మేయర్



తిరుపతి, ఏప్రిల్ 2ప్రభాతవార్త : అమైరా ఇన్నిట్యూట్ ఫర్ స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్ ,బట్టర్ ఫ్లై చిల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ అటిజందినోత్సవం జరిగింది. ఆయా సంస్థలప్రతినిధులు డాక్టర్ పవన్, డాక్టర్ అనూష ఆధ్వర్యంలో గురువారం ఉదయం వాక్ థాన్ ను భవాని నగర్ సర్కిల్ నుండి ప్రకాశం మున్సిపల్ పార్క్ వరకు నిర్వహించారు. మునిసిపల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరపాలక మాజీ మేయర్ డాక్టర్ శిరీష, రుయా సూపరింటెంట్ డాక్టర్ మనోహర్ లు విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రపంచ అటిజంరోజున వాక్ థాన్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, ఈసమస్యను పరిష్కరించేందుకు తాము ఉన్నామని ర్యాలీని నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. అమైరా హాస్పిటల్స్ ప్రతినిధులు డాక్టర్ పవన్, డాక్టర్ అనూష వాక్ థాన్ ర్యాలీ నిర్వహించడం వల్ల ప్రజలలో చైతన్యం కలిగించడం కోసం చేసిన చిరు ప్రయత్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, ప్రకాశం మునిసిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీనాథ్, కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి గురునాథం, సోనీ వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ ప్రతినిధులు రాజేంద్రశెట్టి, సోము రవికుమార్, హేమచంద్ర, మట్టా పురుషోత్తం, జయరాం ప్రసాద్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రెడ్డప్ప, జెసిఐ ప్రతినిధి తనుషా, యంగ్ ఇండియా ప్రతినిధి గౌరీ తదితరులు పాల్గొన్నారు

## అమరావతి రైతుల త్యాగాలకు న్యాయం జరిగింది

### టిడిపి నేత దశరథ వాసు



నింద్ర, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించడంతో అమరావతి రైతుల త్యాగాలకు న్యాయం జరిగిందని చిత్తూరు జిల్లా పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు దశరథ వాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాలను ఇచ్చిన ప్రజా రాజధాని అమరావతి అని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా రాజధానిపై అస్పష్టత నెలకొనడం వల్ల పెట్టుబడులు పెట్టేవారు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. గత వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందని విమర్శించారు. మూడు రాజధానుల పేరిట అమరావతిని విధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను ప్రజలు సమర్థంగా తిప్పికొట్టారన్నారు. ప్రధాని నరేంద్ర మోడి సహకారంతో ప్రస్తుతం పార్లమెంట్ ఆమోదం పొందడం వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో అమరావతి అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## అంబరాన్నంటిన అమరావతి సంబరాలు



ఏర్పేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి ని పార్లమెంట్ లో బిల్లు పాస్ అయిన సందర్భంగా ఏర్పేడు మండలం ఏర్పేడు కూడలినందు టీడీపీ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాలుగుణ్ణి బాణా సంచా కాల్చి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారని కార్యక్రమం లో ఏర్పేడుమండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాల యం ఛైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి, పాక్స్ ఛైర్మన్ మహేష్‌రెడ్డి సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి, మోహన్ నాయుడు, గాలి క్రిష్ణవేణి, బాబు నాయుడు, కేశినేని సుబ్రహ్మణ్యం, రవి నాయుడు క్రిష్ణప్ప మొదలైయార్, రమణ, రాఘవేంద్ర, రాచటి సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిరెడ్డి, రామదాసు, సీతపతి ఆచారి, శీను, హంస, రమణయ్య, బాలకృష్ణారెడ్డి, సురేష్, నాగేశ్వరావు, వెంకయ్య, హరి, సత్యం, మునేశ్వర్, రాంబత్తయ్య, బాలకృష్ణ, నరసింహులు, వెంకట రమణ, గణేష్ నాయుడు, మురళి, నారాయణ, నరసింహులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి బిల్లు ఆమోదంతో సంబరాలు




శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 2 ప్రభాతవార్త: అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా చట్టబద్ధత చేస్తూ పార్లమెంట్ చట్టం చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశానుసారం శ్రీకాళహస్తి రూరల్ మండలం గుంటకిందపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామిగుడి ముందు కొబ్బరి కాయలు కొట్టి, తపాసుల పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్ ,జెడ్పిటిసి సుబ్బారెడ్డి, ఎక్స్‌పిఏసిఎస్ చైర్మన్ రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీశ్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ రేవెళ్ల రమేష్ యూనిట్ ఇంచార్జ్ బత్తయ్య తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



తొట్టంబేడు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త: మనబడి మన బాధ్యత ఆదర్శ ప్రాథమిక పాఠశాల చియ్యవరంఎన్రోల్మెంట్ డ్రైవ్ 6వ రోజు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ధనశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామస్తులకు గురువారం పిలుపునిచ్చారు. ఈ మేరకు 4మంది విద్యార్థిని, విద్యార్థులను ఆదర్శ ప్రాథమిక పాఠశాల, చియ్యవరం లో అడ్మిషన్ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల, చియ్యవరం ప్రధానోపాధ్యాయులు దేవేంద్ర పెరిమిడి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు సుహాసిని ,గంగారావు , రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం అంగన్వాడి ఉపాధ్యాయురాలు సుజాతమరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.